TITLE CODE: APTEL16281

తెలుగు దినపత్రిక

# పీపుల్స్ మోటివేషన్

People's Motivation

ఆంధ్రప్రదేశ్ / తెలంగాణ

సంపుటి : 01 | సంచిక : 221 | ఎడిటర్ : ఎం. రమేష్ | శుక్రవారం, జులై 12, 2024 | పేజీలు : 08 | వెల రూ. 5.00/-



# వైకాపా పాలనతో.. రాష్ట్రం దివాలా



### డబ్బుల్లేని దుర్భర పరిస్థితి నెలకొంది
### ఉత్తరాంధ్రను దోచుకున్న జగన్
### రాష్ట్రం నిలదొక్కుకునేలా చేస్తా
### పోలవరం ఎడమకాలువ పనుల పరిశీలన
### విశాఖ ఉక్కును కాపాడుకకుంటామన్న చంద్రబాబు



అనకాపల్లి,జూలై11(పీపుల్స్ మోటివేషన్): వైకాపా పాలనతో రాష్ట్రం మొత్తం దివాలా తీసిందని.. డబ్బుల్లేని పరిస్థితి నెలకొందని సిఎం చంద్రబాబు నాయుడు అన్నారు. ప్రధాని మోదీని కలిసి రాష్ట్ర పరిస్థితి వివరించినట్లు సీఎం తెలిపారు. భగవంతుడు ఇచ్చిన శక్తితో ప్రజల రుణం తీర్చుకుంటానని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. ప్రజలు నిలవాలి.. రాష్ట్రం నిలదొక్కుకోవాలని ఆకాంక్షించారు. అరాచకాలు చేసే వ్యక్తిని ప్రజాకోర్టులో శిక్షించారన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల పర్యటనలో భాగంగా అనకాపల్లి జిల్లా దార్లపూడిలో పోలవరం ఎడమ కాలువను ఆయన పరిశీలించారు. అంతకుముందు దానికి సంబంధించిన ఫొటో ప్రదర్శనను తిలకించి అధికారులకు పలు సూచనలు చేశారు. కాలువను పరిశీలించిన అనంతరం అక్కడి ప్రజలను ఉద్దేశించి సీఎం మాట్లాడారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పూర్తిచేస్తే ఈ జిల్లా అభివృద్ధి చెందుతుందన్నారు. రాష్ట్రం నిలదొక్కుకునేందుకు తన బాధ్యతను నెరవేరుస్తానని చెప్పారు. పోలవరం ప్రాజెక్టును గోదావరిలో కలిపేశారు తెదేపా హయాంలోనే పోలవరం 72 శాతం పూర్తిచేశాం. గత ప్రభుత్వం ఆ ప్రాజెక్టును గోదావరిలో కలిపేసింది. పోలవరం ఎప్పుడు పూర్తవుతుందో చెప్పలేని పరిస్థితికి తీసుకొచ్చారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతితో ప్రతి ఎకరాకూ నీరందుతుంది. ఈ ప్రాజెక్టు పూర్తికి రూ.800 కోట్లు ఖర్చవుతుంది. దీని ద్వారా లక్ష ఎకరాలకు సాగునీరు అందుతుంది. టెండర్లు పిలిచి వీలైనంత త్వరగా ప్రాజెక్టును పూర్తిచేస్తాం. పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం ద్వారా 2500 క్యూసెక్కుల నీటిని తీసుకుని రావొచ్చు. గోదావరి జలాలు అనకాపల్లి జిల్లాకు రావాలి. ఈ జిల్లాకు సాగునీరందిస్తే నా జన్మ సార్థకం అవుతుందన్నారు. ఇకపోతే ఆర్థిక ఉగ్రవాదులు విశాఖను దోచుకున్నారని అన్నారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు వంశధార వరకు వెళు_ంది. గోదావరి, కృష్ణా, వంశధార, పెన్నా నదులను అనుసంధానం చేయాలి. దాంతో రాష్ట్రంలో కరవు లేకుండా చేస్తాం. అనకాపల్లి జిల్లాలో 3 చక్కెర కర్మాగారాలను పడకేసే పరిస్థితికి తీసుకొచ్చారు. రైతులకు న్యాయం చేయడం ఎన్డీయే కూటమి కర్తవ్యం. అబద్దాలు చెప్పే నేతల వ్యాఖ్యలు ఎప్పటికప్పుడు


▶ (మిగతా 2వ పేజీలో..)

## ఎపిలో భారీగా ఐఏఎస్ అధికారులు బదిలీ

**విజిలెన్స్,ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీగా హరీశ్ కుమార్ గుప్తా**
**హోంశాఖ ముఖ్య కార్యదర్శిగా కుమార్ విశ్వజిత్**

**అమరావతి,జూలై11(పీపుల్స్ మోటివేషన్):**

ఆంధ్రప్రదేశ్‌లో భారీగా ఐఏఎస్ అధికారులు బదిలీ అయ్యారు. 19 మంది ఐఏఎస్‌లను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్ కుమార్ ప్రసాద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరితో పాటు ఇద్దరు ఐపీఎస్ అధికారులు కూడా బదిలీ అయ్యారు. విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీగా హరీశ్ కుమార్ గుప్తా, హోంశాఖ ముఖ్య కార్యదర్శిగా కుమార్ విశ్వజిత్ నియమితులయ్యారు. అటవీ, పర్యావరణ శాస్త్ర సాంకేతిక ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా జి.అనంతరాము నియమితులయ్యారు. ఆర్.పి. సిసోడియా- స్టాంపులు, రిజిస్ట్రేషన్లశాఖ కార్యదర్శిగా పోస్టింగ్ ఇచ్చారు. సీసీఎల్ఏ చీఫ్ కమిషనర్‌గా జి.జయలక్ష్మి బాధ్యతలు చేపట్టనున్నారు. ఆర్ అండ్ బీ ముఖ్యకార్యదర్శిగా కాంతిలాల్ దండే, పెట్టుబడులు మౌలిక సదుపాయాల కార్యదర్శిగా సురేశ్ కుమార్, గ్రామవార్డు సచివాలయం పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. జీఏడీ కార్యదర్శిగానూ సురేశ్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. సౌరభ్ గౌర్- ఐటీశాఖ, ఆర్టీజీఎస్ కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించారు. యువరాజ్- పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ కార్యదర్శిగా, హర్షవర్ధన్- మైనార్టీ సంక్షేమశాఖ కార్యదర్శిగా, పి.భాస్కర్- వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ కార్యదర్శిగా, పి.భాస్కర్- ఈడబ్ల్యూఎస్, జీఏడీ సర్వీసెస్ అదనపు బాధ్యతలు అప్పగించారు. కె.కన్నబాబు- సాంఘిక సంక్షేమశాఖ కార్యదర్శిగా, గిరిజన సంక్షేమం, పంచాయతీరాజ్ శాఖ కమిషనర్‌గానూ బాధ్యతలు అప్పగించారు. వినయ్‌చంద్- పర్యాటకశాఖ కార్యదర్శిగా, వివేక్ యాదవ్- యువజన సర్వీసులు, క్రీడలశాఖ కార్యదర్శిగా, సూర్యకుమారి- మహిళా, శిశుసంక్షేమం, దివ్యాంగుల సంక్షేమ కార్యదర్శిగా బదిలీ అయ్యారు. సి.శ్రీధర్- ఇండస్ట్రీస్ డైరెక్టర్‌గా, జె.నివాస్- ఆర్థికశాఖ అదనపు కార్యదర్శిగా పోస్టింగ్ ఇచ్చారు. విజయరామరాజు- పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్‌గా పోస్టింగ్ ఇచ్చారు. హిమాంశు శుక్లా- సమాచార, పౌర సంబంధాలశాఖ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ఢిల్లీరావు- వ్యవసాయశాఖ డైరెక్టర్‌గా, వ్యవసాయశాఖ నుంచి హరికిరణ్‌ను బదిలీ అయ్యారు. గిరిజాశంకర్‌ను ఆర్థికశాఖ నుంచి రిలీవ్ చేశారు.




## ఆర్థికస్థితిని దారిలోకి తేవాల్సిందే

**బాధ్యతలు చేపట్టిన ఆర్థికమంత్రి కేశవ్**

అమరావతి,జూలై11(పీపుల్స్ మోటివేషన్): ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టడం.. ఎకానమీని పునరుద్ధరించడం తన ముందున్న ప్రధాన లక్ష్యమని ఎపి ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. గడచిన ఐదేళ్లలో వ్యవస్థను దెబ్బతీశారన్నారు. ఆర్థిక మంత్రిగా పయ్యావుల కేశవ్ గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఆ వెంటనే 15వ ఆర్థిక సంఘం నిధులు 250 కోట్ల రూపాయలు స్థానిక సంస్థలకు విడుదల చేస్తూ ఫైల్‌పై సంతకం చేశారు. ఈ సందర్భంగా పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ.. ఈ సందర్భంగా ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టడం తన మొదటి బాధ్యతగా పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం 16 పథకాలను ఆపేసిందని.. వాటిలో 60 శాతం రాష్ట్రం... 40 శాతం కేంద్రం నిధులు పెట్టేవని పేర్కొన్నారు. వీటి మొత్తాన్ని ఆపేశారని పయ్యావుల కేశవ్ వెల్లడించారు. కేంద్రం నిధులు కూడా వాడుకోని పరిస్థితి వైసీపీ హయాంలో ఉందన్నారు. వ్యవస్థలు అన్నీ గాడి తప్పాయన్నారు. ఎవరు జగన్‌కి సలహా ఇచ్చారో కూడా తెలియదని పయ్యావుల కేశవ్ అన్నారు. కామన్ మ్యాన్ నుంచి వచ్చే కన్నా పరిశ్రమల నుంచి వచ్చే ఆదాయమే ఎక్కువన్నారు. సెంట్రల్ గవర్నమెంట్ స్కీంలు సరిగా వాడితే ఎంతో మేలన్నారు. ఎలక్ట్రిసిటీపై డ్యూటీలను దారుణం గా వేశారన్నారు. అక్క చెల్లమ్మలకు, అవ్వ తాతలకు జగన్ ఇచ్చిన దాని కన్నా దోచింది ఎక్కువని పయ్యావుల కేశవ్ అన్నారు. చంద్రబాబు టీం శక్తికి మించి ఈ రాష్ట్రం కోసం పని చేస్తోందన్నారు.

## భోగాపురం విమానాశ్రయంతో ఆర్థిక పురోగతి

**2026 నాటికి తొలిదశ నిర్మాణాలు పూర్తి**
**లక్షల మందికి ఉపాధి దక్కేలా ప్రణాళిక**
**గత ప్రభుత్వ హయాంలో ఎయిరర్‌పోర్ట్, పోలవరం నిర్లక్ష్యం**
**ఉత్తరాంధ్ర పర్యటనలో సిఎం చంద్రబాబు వెల్లడి**

**భోగాపురం,జూలై11(పీపుల్స్ మోటివేషన్):**



భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణం పూర్తయితే ఈ ప్రాంతం ఒక ఎకనామిక్ హబ్‌గా మారుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. విహంగ వీక్షణం ద్వారా భోగాపురం విమానాశ్రయం ప్రాంతాన్ని పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. 'భోగాపురం వరకు బీచ్‌రోడ్ నిర్మాణం కూడా జరగాలన్నారు. పారిశ్రామికంగా ఎదిగేందుకు భోగాపురం ప్రాంతానికి మంచి అవకాశాలున్నాయి. నేను సీఎంగా ఉన్నప్పుడే అన్ని అనుమతులు వచ్చాయి. నేషనల్ హైవే నుంచి విమానాశ్రయానికి రోడ్ల కనెక్టివిటీ పెంచాలి. గత ప్రభుత్వ వైఖరి వల్ల అన్నీ మళ్లీ మొదటి నుంచి చేయాల్సి వస్తోందని అన్నారు. భోగాపురం విమానాశ్రయం ప్రారంభంలోనే 48లక్షల మంది ప్రయాణికులతో రన్ అయ్యే పరిస్థితి ఉంటుంది. ఉత్తరాంధ్ర యువత ఉద్యోగాల కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన అవసరం ఉండదు. ఎన్డీయే కూటమికి ఉత్తరాంధ్ర బ్రహ్మరథం పట్టింది. అండగా నిలిచిన ప్రజలకు ఏదైనా చేయాల్సి ఉంది. అందుకే జిల్లా పర్యటనల్లో మొదటగా ఉత్తరాంధ్రకు వచ్చాను. 2026 జూన్ నాటికి భోగాపురం విమానాశ్రయం తొలిదశ పూర్తి చేస్తాం. వేగంగా పూర్తి చేయించే బాధ్యత కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడిపై ఉందని చంద్రబాబు తెలిపారు. రాజకీయాల్లో విర్రవీగిన వారికి ప్రజలు తగిన శిక్ష వేశారని చురకలు అంటించారు. రాష్ట్రం నిలదొక్కుకోవడానికి తమ బాధ్యత తాము నిర్వహిస్తామని అన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత తొలిసారి ఉత్తరాంధ్రలో పర్యటించారు. . పోలవరం ఎడమకాలువ పనులను పరిశీలించడంతో పాటూ భోగాపురం ఎయిర్ పోర్టు పనులపై ఆధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కొన్ని కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వమే కాకుండా ప్రజలు కూడా అభివృద్ధికి సహకరించాలని కోరారు. విశాఖ స్టీల్స్ ప్రైవేటీకరణను తాను ఒప్పుకున్నామని చెబుతున్నారు.. అవన్నీ అబద్ధాలని అన్నారు. గతంలో వాజపేయి హయాంలోనే ప్రైవేటీకరణ చేస్తాన్నప్పుడు అడ్డుకున్నామని స్పష్టం చేశారు. ఈ సారి విశాఖ ప్రైవేటీకరణ జరగకుండా కాపడుతామన్నారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పనులు 5 ఏళ్ల క్రితం ఎలా ఉన్నాయో ఇప్పుడు అలానే ఉన్నాయని చంద్రబాబు అన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో పనులు జరగలేదని చంద్రబాబు విమర్శించారు. టీడీపీ హాయాంలో పోలవరం పనులు 72 శాతం పూర్తి చేస్తే.. జగన్ ప్రభుత్వం డయాఫ్రమ్ వాల్‌ని గోదావరిలో కలిపేసిందని ఆరోపించారు. జగన్ ప్రభుత్వ వైఫల్యంతోనే పోలవరం ప్రాజెక్టులో డయాఫ్రమ్ వాల్, కాపర్ డ్యామ్స్ దెబ్బతిన్నాయని విమర్శించారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పనులు పూర్తి కావడానికి సమయం పడుతుందని.. అనకాపల్లి ప్రాంత రైతుల కోసం పురుషోత్తపట్నం లిఫ్ట్ పనులను వేగంగా పూర్తి చేస్తామని సీఎం చంద్రబాబు అన్నారు. వెంటనే నిధులు విడుదల చేసి పనులు పూర్తి చేయాలని అధికారులను అక్కడికక్కడే ఆదేశించారు. సిఎం వెంట కేంద్రమంత్రి రామ్మోమన్ నాయుడు, రాష్ట్రమంత్రులు అనిత, నిమమల రామానాయుడు, స్థానిక ఎమ్మెల్యేలు ఉన్నారు.






తెలుగు దినపత్రిక
పీపుల్స్ మోటివేషన్
People's Motivation

## వైకాపా పాలనతో రాష్ట్రం దివాలా

(మొదటి పేజీ తరువాయి)



ఖండించాలి. కరడుగట్టిన ఆర్థిక ఉగ్రవాదులు విశాఖను దోచుకున్నారు. ప్రజల భూములన్నీ కొట్టేయాలనుకున్నారు. ఇచ్చిన హామీ మేరకు ఉచిత ఇసుక పంపిణీ చేస్తున్నాం.. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేశామని చంద్రబాబు వివరించారు. విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ విషయంలో కొందరు పనిగట్టుకుని దుష్ప్రచారాలు చేస్తున్నారని ఏపీ సీఎం చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాంటి వారి మాటలు నమ్మొద్దని ప్రజలకు సూచించారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ఎలా కాపాడుకోవాలో ఆలోచిస్తున్నామని.. తెలుగువారి ఆత్మగౌరవం కోసం పుట్టిన పరిశ్రమ, ఆంధ్రుల హక్కు అని చెప్పి సాధించుకున్న ఫ్యాక్టరీని వదులుకునేది లేదని స్పష్టం చేశారు. అబద్దాలు చెప్పే రాజకీయ పార్టీ అసత్య ప్రచారం తప్ప ఏమీ చేయలేదని మండిపడ్డారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు తాను ఒప్పుకొన్నాననే ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా గొర్రెపిల్ల, కుక్కపిల్ల కథను ఉద్ఘాటించారు. గొర్రెపిల్లను తీసుకెళ్తుంటే కుక్క పిల్లని తీసుకెళ్తున్నావంటూ ఒకరు అంటారని.. ఆ తర్వాత మరొకరు, ఇంకొకరు సైతం అలాగే అంటారని చెప్పారు. దీన్ని నమ్మిన గొర్రె పిల్లను తీసుకెళ్లే వ్యక్తి అది కుక్క పిల్లే అని నమ్మి వదిలేస్తే దాన్ని వారు కాజేస్తారని, వైసీపీ వాళ్లు సైతం ఇలాగే చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విశాఖ ఉక్కు పరిశ్రమను కాపాడతామని స్పష్టం చేశారు. ఆర్థిక ఉగ్రవాదులు విశాఖను దోచేశారని చంద్రబాబు మండిపడ్డారు. గోదావరి జలాలు అనకాపల్లి జిల్లాకు రావాలి. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు వంశధార వరకూ వెళ్తుంది. గోదావరి, కృష్ణా, వంశధార, పెన్నా నదులకు అనుసంధానం చేయాలి. దీంతో రాష్ట్రంలో కరువు అనేది ఉండదు. వైసీపీ హయాంలో అనకాపల్లి జిల్లాలో 3 చక్కెర కర్మాగారాలు పడకేసే పరిస్థితికి తీసుకొచ్చారు. రైతులు, మహిళలు, విద్యార్థులు, అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేయడమే కూటమి ప్రభుత్వ కర్తవ్యం. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అన్నింటినీ నెరవేరుస్తాం.' అని సీఎం పేర్కొన్నారు. ఆయన వెంట హోంమంత్రి వంగలపూడి అనిత,జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఎంపి సిఎం రమేశ్ , అధికారులు ఉన్నారు.

## పిడుగురాళ్లో డయేరియా కేసులు

**స్వయంగా పరిశీలించిన మంత్రి నారాయణ**
**నీటి వాడకంపై ప్రజలతో ఆరా**

**పల్నాడు,జూలై11(పీపుల్స్ మోటివేషన్):**

పిడుగురాళ్లలో డయేరియా కేసులు పెరుగుతుండటంపై ఏపీ ప్రభుత్వం అలర్ట్ అయింది. ఈ సందర్భంగా వైద్యారోగ్యశాఖ అధికారులకు మంత్రి నారాయణ కీలక ఆదేశాలు జారీ చేశారు. పిడుగురాళ్ల లెనిన్ నగర్ , మారుతి నగర్‌లో మంత్రి నారాయణ గురువారం పర్యటించారు. డయేరియా ప్రభావిత ప్రాంతంలో అధికారులతో కలిసి పలు ప్రాంతాలను పరిశీలించారు. పారిశుధ్య నిర్వహణ, తాగు నీటి బోర్లను పరిశీలించారు. స్వయంగా కొంతమంది ఇళ్లకు వెళ్లి నీటి సరఫరా వాడకంపై మంత్రి వివరాలు అడిగి తెలుసుకున్నారు. లెనిన్ నగర్ పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న డయేరియా బాధితులను మంత్రి నారాయణ పరామర్శించారు. బాధితులకు అందుతున్న వైద్యంపై ఆరా తీశారు. డయేరియా కట్టడికి తీసుకోవాల్సిన చర్యలపై స్థానిక ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్‌లో అధికారులతో మంత్రి నారాయణ సమీక్షించారు. పిడుగురాళ్లలోని లెనిన్‌నగర్, మారుతి నగర్‌లో ఇప్పటి వరకూ 60 డయేరియా కేసులు నమోదయ్యాయని మంత్రి నారాయణ తెలిపారు. ప్రస్తుతం 39 మంది వివిధ హాస్పిటళ్లలో చికిత్స పొందుతున్నారని చెప్పారు. చికిత్స పొందుతున్న వారి ఆరోగ్యం నిలకడగా ఉందన్నారు. కృష్ణా నది నుంచి తాగునీరు అందించేందుకు 16 కి.మీ పైప్ లైన్ ఉందని దీంతో పాటు పట్టణంలో 7 పవర్ బోర్స్, 36 హాండ్ బోర్స్ ఉన్నాయని చెప్పారు. ఒక పవర్ బోర్‌లో నైట్రేట్ ఉన్నట్లు పరీక్షల్లో గుర్తించినట్లు వివరించారు. కృష్ణా వాటర్ పైప్ లైన్ లీకేజి ఉండటంతో ఐదు రోజుల పాటు నీటి సరఫరా నిలిపి వేశారని మండిపడ్డారు. ఐదు రోజుల్లో బోరు నీటిని వాడారని చెప్పారు. కృష్ణా పైప్ లైన్ ద్వారా ప్రస్తుతం తాగు నీరు ఇస్తున్నప్పటికీ ఇంకా కేసులు వస్తున్నాయని చెప్పారు. నీటిని పరీక్ష కోసం విజయవాడ ల్యాబ్‌కు ఈరోజు శాంపిల్స్ పంపిస్తున్నామని వివరించారు. లెనిన్ నగర్, మారుతి నగర్ ప్రజలు నీళ్లు కాచి తాగాలని అన్నారు. పట్టణంలో ఉన్న ఆర్వో ఎ÷-లాంట్స్ అన్నీ కూడా టెస్ట్ చేయాల్సి ఉందని చెప్పారు. రాబోయే 5, 6 రోజుల్లో నీరు ఎక్కడ కలుషితం అయిందనేది క్లారిటీ వస్తుందని చెప్పారు. కారణం తెలిసే వరకూ ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఆదేశించారు. లెనిన్ నగర్,మారుతి నగర్‌లో డ్రెయిన్‌లలో నీరు పోవడం లేదన్నారు. మొత్తం సిల్ట్, కంపలు తొలగించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశామని అన్నారు. రేపు అత్యవసరంగా డ్రైన్లలో సిల్ట్ , ముళ్ల కంపలు తొలగించాలని ఆదేశాలిచామని అన్నారు. 2014 - 19 లో టీడీపీ హయాంలో వర్షా కాలంలో స్పెషల్ డ్రైవ్ చేసే వాళ్లమని అన్నారు. గత ప్రభుత్వం ఆసియన్ ఇన్‌ఫ్రా బ్యాంక్ ఇచ్చిన రూ. 5300 కోట్లలో రూ.200 కోట్లు కూడా ఖర్చు పెట్టలేదని అన్నారు. ప్రభుత్వం ఇవ్వాల్సిన మ్యాచింగ్ ఫండ్ ఇవ్వకపోవడంతో నిధులు విడుదల కాలేదని అన్నారు. కేంద్రంతో ఉన్న సంబంధాలతో రాష్ట్రానికి నిధులు వచ్చేలా సీఎం చంద్రబాబు ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. ఆసియన్ ఐన్‌ఫ్రా బ్యాంక్, అమృత్ నిధులపై దృష్టి పెట్టామని మంత్రి నారాయణ తెలిపారు.

## పాలిటెక్నిక్ కళాశాల స్థలమును ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు





**బేతంచర్ల, జులై 11 (పీపుల్స్ మోటివేషన్):-**

మండల పరిధిలోని గోరుమానుకొండ సమీపన పాలిటెక్నిక్ కళాశాల భవన నిర్మాణానికి ప్రభుత్వము 4 ఎకరముల భూమిని కేటాయించిందని ప్రిన్సిపాల్ రాజేష్ ,గురువారం తెలిపారు సర్వే నంబర్ 547-1ఎ3లో80 సెంట్లు కేటాయించారు.ఈ ఏడాది మార్చి నెల 8వ తేదీన పాలిటెక్నిక్ కళాశాల భవన నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు.భవన నిర్మాణానికి సంబంధించి ఎన్నికల కోడ్ రావడంతో టెండరింగ్ వెయ్యడం ఆలస్యం కావడంతో పాలిటెక్నిక్ కళాశాల కేటాయించిన స్థలం రికార్డులను అక్టోబర్ నెల 2023 లో రెవెన్యూ అధికారులు మాకు కేటాయించడం జరిగింది సర్వే నంబర్ 547-1ఎ3 లోని 3.28 ఎకరాల స్థలమును కొంతమంది చదును చేస్తున్నారని సమాచారం మేరకు పరిశీలిచ్చామన్నారు ఇక్కడ రాళ్లను చదును చేశారని ఇది అక్టోబర్ నెలలో2023 అధికారులు మాకు రికార్డులను అప్పగించారని వారన్నారు.ఈ స్థలమును కొంతమంది చదును చేస్తున్నారని మాచవరం మేరకు పరిశీలించామని ఇది ప్రభుత్వ స్థలం అన్నారు పిల్లల భవిష్యత్తుకు సంబంధించి ప్రభుత్వం కళాశాలకు స్థలం కేటాయించారని స్థలమాక్రమిస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని ఈ స్థలం పైన పోలీస్ స్టేషన్లో రెవెన్యూ అధికారులకు కలెక్టర్ కి ఫిర్యాదు చేస్తామన్నారు.

## కొల్లాపూర్ రోడ్డు అంబేద్కర్ చౌరస్తాలో బొలెరో వాహన కార్యాలయం ప్రారంభం





**ముఖ్య అతిథులు మోటారు వాహన ఇన్స్పెక్టర్ వాసుదేవరావు, ఎస్సై హరిప్రసాద్ రెడ్డి**
**వాహనదారుడు డ్రైవింగ్ లైసెన్స్,ఆర్ సి, ఇన్సూరెన్స్ ఉండాలి**
**డ్రైవింగ్ చేసేటప్పుడు జాగ్రత్తలు వహించాలి**
**మన కుటుంబాని దృష్టిలో ఉంచుకొని డ్రైవింగ్ చేయాలి**

**మన జాగ్రత్తే మనకు రక్ష**

**పెబ్బేరు, జులై 11 (పీపుల్స్ మోటివేషన్):-**

పెబ్బేరుమున్సిపాలిటీ టౌను కొల్లాపూర్ రోడ్డు అంబేద్కర్ చౌరస్తా దగ్గర జై హనుమాన్ బోలేరో అసోసియేషన్ కార్యాలయాన్ని గురువారం పెబ్బేరు మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ వాసుదేవరావు,పెబ్బేరు ఎస్ఐ హరిచంద్రర్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ వాహనదారులు వాహనాలను జాగ్రత్తగా నడపాలని అదేవిధంగా మద్యం సేవించి ఫోన్లో మాట్లాడుతూ తరచుగా ప్రమాదాలు జరుగుతుంటాయి కాబట్టి మన కుటుంబాన్ని దృష్టిలో ఉంచుకొని డ్రైవింగ్ చేయాలి. మన కుటుంబానికి మనం లేకపోతే ఆ లోటు ఎవరూ తీర్చలేరు, మన జాగ్రత్త మనకు రక్ష,ప్రతి వాహనదారుడు తప్పకుండా డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సి, ఇన్సూరెన్స్ కాగితాలను వెంట ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సంఘ అధ్యక్షులు రాజశేఖర్, ఉపాధ్యక్షులు జమదగ్ని, జనరల్ సెక్రెటరీ లోకేష్ నాయక్, జాయింట్ సెక్రెటరీ రామకృష్ణ, అసోసియేషన్ సభ్యులు స్వామి, మక్బూల్, రామస్వామి, రమేష్, నిరంజన్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## కర్నూల్ ఎంపీని కలిసిన టిఎన్టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం అశోక్ కుమార్





**పత్తికొండ, జూలై 10 (పీపుల్స్ మోటివేషన్):-**

కర్నూలు జిల్లా ఎంపీ బస్తిపాడు నాగరాజు తో టిఎన్టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం అశోక్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి ఎంపీ నాగరాజుకి శుభాకాంక్షలు తెలియజేసి పూలదండలు శాలువలు వేసి సన్మానం చేయడం జరిగింది ఎంపీ ఈ విధంగా మాట్లాడుతూ తమ గెలుపునకు కష్టపడిన ప్రతి నాయకుడికి కార్యకర్తకి ఎల్లప్పుడూ అండగా ఉంటానని తెలియజేశారు ఈ కార్యక్రమంలో మెడికల్ అండ్ హెల్త్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నాగరాజు మద్దిలేటి మాధవరాజు చంద్రశేఖర్ టిఎన్టీయూసీ జిల్లా అధ్యక్షుడు వై నర్సిములు ,తెలుగు యువత నగర అధ్యక్షులు శివప్రసాద్ తెలుగు యువతర నాయకులు జనార్దన్ టిడిపి నాయకులు టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారని తెలియజేశారు.

## తెలంగాణలో టెలి కమ్యూనికేషన్స్ పెట్టుబడి

**500 కోట్ల పెట్టుబడి పెట్టడానికి అంగీకారం**
**మంత్రి శ్రీధర్ బాబుతో ప్రతినిధుల భేటీ**

**హైదరాబాద్,జూలై11(పీపుల్స్ మోటివేషన్):**

అమెరికా టెలి కమ్యూనికేషన్స్ దిగ్గజం మైక్రోలింక్ నెట్ వర్క్స్ రూ.500 కోట్ల పెట్టుబడితో తెలంగాణాలో తమ ఎలక్ట్రానిక్, ఇతర ఉత్పత్తుల కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చిందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. హైదరాబాద్ కు చెందిన పిఎస్ ఆర్ ఇండస్ట్రీస్ భాగస్వామ్యంతో మైక్రోలింక్ పరిశ్రల క్లస్టర్ ను ప్రారంభిస్తుందని తెలిపారు. గురువారం మైక్రోలింక్ గ్లోబల్ ప్రతినిధులు, భారతీయ భాగస్వామి 'పిఎస్ ఆర్ ఇండస్ట్రీస్ ఛైర్మన్ శ్రీరంగారావు మంత్రితో సచివాలయంలో సమావేశమయ్యారు. వచ్చే మూడేళ్లలో రూ.500 కోట్ల పెట్టుబడితో ఎలక్ట్రానిక్, ఐటీ, నిర్మాణరంగ పరికరాలను ఉత్పత్తి చేస్తుందని శ్రీధర్ బాబు వివరించారు. రానున్న మూడేళ్లలో 700 మందికి ఉపాధి లభిస్తుందని చెప్పారు. ఇటీవల తన అమెరికా పర్యటనలో మైక్రోలింక్ నెట్ వర్క్స్ యాజమాన్యంతో జరిపిన చర్చలు ఫలవంతం అయ్యాయని అన్నారు. అనంతరం తెలంగాణాలో పెట్టుబడులకు అంగీకరించిందని శ్రీధర్ బాబు తెలిపారు. డేటా ట్రాన్స్ మిషన్, నెట్ వర్కింగ్ కేబుల్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, మల్టీ లెవెల్ పార్కింగ్ మిషన్ల ఉత్పత్తిలో మైక్రోలింక్ నెట్ వర్క్స్ గ్లోబల్ లీడర్ గా ఉంది. ఇప్పుడా కంపెనీ పిఎస్ ఆర్ ఇండస్ట్రీస్ భాగస్వామ్యంతో పరిశ్రమలను ఏర్పాటు చేస్తుందని ఆయన తెలిపారు. తెలంగాణాలో నైపుణ్యం ఉన్న సిబ్బందికి కొరత లేదని వెల్లడించారు. సమావేశంలో పిఎస్ ఆర్ ఇండస్ట్రీస్ ఛైర్మన్ శ్రీరంగారావు, డైరెక్టర్ నమ్యుత, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ధర్మరాజు చక్రవరం, మైక్రోటెక్ గ్లోబల్ ప్రతినిధులు డా. డెనిస్ మొటావా , సియాన్ ఫిలిప్స్, జో జోగ్బి, అశోక్ పెర్సోత్తమ్ తదితరులు పాల్గొన్నారు.

## మిస్టర్ తెలంగాణ టైటిల్ విజేత దుర్మరణం


**రోడ్డు ప్రమాదంలో మరణించిన సోహైల్**

**సిద్దిపేట,జూలై11(పీపుల్స్ మోటివేషన్):**

'మిస్టర్ తెలంగాణ' టైటిల్ విజేత, ప్రముఖ బాడీ బిల్డర్ మహ్మద్ సోహైల్ రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. బైక్ పై వేగంగా దూసుకెళుతూ అదుపుతప్పి ఆటోను ఢీ కొట్టాడు. దీంతో తీవ్రగాయాలపాలైన సోహైల్ ను స్థానికులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోహైల్ చనిపోయాడని వైద్యులు ప్రకటించారు. బాడీ బిల్డర్ గా పలు ఛాంపియన్ షిప్ లు గెల్చుకున్న సోహైల్ వయసు కేవలం 23 ఏళ్లు మాత్రమే. తన కెరీర్‌లో సిద్దిపేట్ జిల్లా, తెలంగాణ రాష్ట్ర, సౌతిండియా బాడీ బిల్డింగ్ ఛాంపియన్‌షిప్‌లను సొంతం చేసుకున్నాడు. చిన్న వయసులోనే సోహైల్ 'మిస్టర్ తెలంగాణ' టైటిల్ ను గెల్చుకున్నాడు. చిన్నవయసులోనే సోహైల్ చనిపోవడంపై సిద్దిపేట వాసులు విచారం వ్యక్తం చేస్తున్నారు.

తెలుగు దినపత్రిక
పీపుల్స్ మోటివేషన్
People's Motivation
శుక్రవారం । జులై । 12 । 2024


# సముద్ర అలల తాకిడికి అడ్డుగట్టు వేసేది ఎప్పుడు





**పూర్తిగా శిథిలమైన జియో ట్యూబ్**
**భయం గుప్పెట్లో తీర ప్రాంత ప్రజలు**
**ఉప్పాడ బీచ్ రోడ్డు కనుమరుగయ్యే పరిస్థితి**
**ప్రభుత్వం చర్యలు చేపట్టకపోతే తీర ప్రాంతం జలమయం తప్పదు**

**యు కొత్తపల్లి/ పిఠాపురం, జూలై 11 (పీపుల్స్ మోటివేషన్):-**

ఒక ఉప్పెన కొన్ని గ్రామాలను మింగేస్తుంది.. ఒక సునామీ ఎన్నో చేదు జ్ఞాపకాలను మిగుల్చుతుంది.. ఒక తుఫాను మర్చిపోలేని విషాదాన్ని నింపుతుంది.. ఒక్కసారి సముద్రం ఉగ్రరూపం దాల్చితే వందల జీవితాలు ఛిద్రమవ్వాల్సిందే.. అయితే ఓ ప్రాంతానికి ఉప్పెనలు, సునామీలు, తుఫాన్లు కొత్తకాదు.. ఐదారేళ్లకోసారి ఓ విలయం వారి జీవితాలపై తాండవం చేస్తూనే ఉంటుంది. కానీ ఎప్పటికప్పుడు ప్రకృతి భీభత్సాల్ని దిగమింగుకుని తమకుతాము ధైర్యం చెప్పుకుంటూ గత రెండు దశాబ్దాలుపాటు కాలం సాగిస్తుంటారు. ఇన్నేళ్లుగా భయం గుప్పెట్లో కాలం వెళ్లదీస్తూ గడుపుతున్న తూర్పుగోదావరి జిల్లా యు కొత్తపల్లి మండలం సముద్ర తీర ప్రాంత గ్రామవాసులు గత కొన్ని ఏళ్లలో కోత కారణంగా దాదాపుగా 360 ఎకరాల భూమి సముద్రంలో కలిసిపోయింది. రెండు వందల ఎకరాల పంట భూములు, సరుగుడు తోటలు సహా ఇల్లు బడులు దేవాలయాలు ప్రభుత్వ అతిథి గృహాలు బంగాళాఖాతం మింగేసింది. ఉప్పాడ సమీపంలోని మరో గ్రామమైన కోనపాపపేటలోనూ గత పదేళ్లుగా 20 ఎకరాల పైగా భూమి సముద్రంలో కలిసిపోయింది. ఇళ్లు కోతకు గురయ్యాయి. తుఫాను వచ్చినప్పుడల్లా ఉప్పాడ సముద్ర తీర ప్రాంతం కోతకు గురవుతోంది.

**కాకినాడ బీచ్ రోడ్డు 1978 నిర్మించారు..**

కాకినాడ నుంచి తుని వరకు గల తీరప్రాంతాన్ని కలుపుతూ 1978లో నిర్మించిన బీచ్ రోడ్డు ఇప్పటివరకు 34 సార్లు కోతకు గురైంది. 6 సార్లు రోడ్డు మొత్తం కొట్టుకుపోతుండగా పక్కనే కొత్తరోడ్డు నిర్మిస్తున్నారు. బంగాళాఖాతంలో తుఫాన్లు వస్తే జిల్లా కేంద్రంలోని కాకినాడ పరిసర ప్రాంతాలు వణికిపోతుంటాయి. దశాబ్దాలకాలంగా సముద్రపు కోతతో అత్యతం విలువైన వందల ఎకరాల భూములు సముద్ర గర్భంలో కరిగిపోతుండగా కోట్లాది రూపాయల విలువైన ఇళు ,, ఆస్తులు సముద్రపు కెరటాల తాకిడికి కొట్టుకుపోతున్నాయి. తెలుగుదేశం ప్రభుత్వం హయంలో ప్రతిపక్షనేత హోదాలో ప్రజాసంకల్పయాత్రలో తీరప్రాంత ప్రజలకు సముద్రం ముందుకు రాకుండా జియో ట్యూబ్ నిర్మాణానికి హామీ ఇచ్చి అసెంబ్లీ సాక్షిగా 30 కోట్ల రూపాయలు కేటాయించి నా వైసిపి ప్రభుత్వం దానిని అమలు చేయలేదు. గత ప్రభుత్వంలో సముద్రపు కోత సమస్యను పరిష్కరించాలని కేంద్ర ప్రభుత్వానికి విన్నవించారు. దాంతో కేంద్రం నుండి వచ్చిన బృందం తీరప్రాంతాన్ని పరిశీలించారు అయినప్పటికీ ఎటువంటి చర్యలు చేపట్టలేదు. మొన్న కొత్తగా వచ్చిన ఎన్డీఏ ప్రభుత్వం పిఠాపురం ఎమ్మెల్యే ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తీర ప్రాంతాన్ని పరిశీలించి సముద్రం ముందుకు రాకుండా చర్యలు చేపడతామని తెలిపారు.

**ముప్పు పొంచి ఉందని గతంలో తెలియజేసిన అధికారులు..**

అసలు ఉప్పాడకు సముద్రపు కోతవల్ల ముప్పు ఉందని 1950లోనే అధికారులు గుర్తించారు. సరైన చర్యలు తీసుకోకపోతే మూల్యం తప్పదని ఏయూ శాస్త్రవేత్తల బృందం స్పష్టం చేసింది. 1971లో అప్పటి రాష్ట్రప్రభుత్వం గుర్తించినా ఎటువంటి చర్యలు తీసుకోలేదు. గోదావరి నుంచి భారీ స్థాయిలో ఇసుక కొట్టుకువస్తుండడంతో కాకినాడ సమీపంలో ఏర్పడిన హోప్ ఐ లాండ్ కారణంగానే ఉప్పాడ కోతకు గురవుతోంది. అలల తాకిడితో హోప్ ఐలాండ్‌లో ఇసుకదిబ్బలు పెరిగిపోయి ఉప్పాడ తీరంలో ఇసుక మేటలు వేయడానికి బదులు మట్టికోతకు గురవుతోందని తేల్చారు. ఇలా కోతకు గురవుతున్న ప్రాంతంలో ఏటా 1.5 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుక తెచ్చి తీరంలో వేయాలని బీచ్ ఎరోజన్ బోర్డు సిఫారసు చేసింది. దానిద్వారా అలల తాకిడికి ఇసుకకోతకు గురవుతూ, మళ్లీ ఇసుక మేటలు వేస్తుందని పేర్కొంది. ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వం సముద్రం ముందుకు రాకుండా 2008లో మాజీ సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ఉప్పాడ సముద్రపు కోత నివారణకు రూ.12కోట్లతో జియోట్యూబ్ టెక్నాలజీతో సేఫ్ వాల్ నిర్మించారు. అయితే ఈ గోడ నిర్వహణను తర్వాతి పాలకులు పట్టించుకోలేదు. దాంతో వాల్ శిథిలమై కోత మళ్లీ ప్రారంభమైంది. తాజాగా ప్రభుత్వం మళ్లీ తీర ప్రాంత రక్షణపై


సముద్ర గర్భంలో కలిసిపోయిన దేవాలయం

దృష్టి పెట్టింది. అయితే గతంతో పోల్చితే సముద్రపు కోతను నివారించడానికి నూతన సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చింది. జియోట్యూబ్ టెక్నాలజీ అనేది శాశ్వత పరిష్కారం కాదని, మరిన్ని కొత్త టెక్నాలజీల ద్వారా సముద్రపు కెరటాలను ఒడ్డుకు చేరేలోపే నిర్వీర్యం చేయొచ్చని, ముఖ్యంగా కెరటాల ఉధృతిని భారీగా తగ్గించడం ద్వారా తీరప్రాంతం కోతకు గురి కాకుండా చేసేందుకు పలు రాష్ట్రాల్లో కొత్త టెక్నాలజీని ప్రయోగాత్మకంగా పరీక్షిస్తున్నారు.. ప్రస్తుత ప్రభుత్వం ఇతర రాష్ట్రాల్లో అమలు చేస్తున్న ఉత్తమ విధానాలను అధ్యయనం చేసి తమ ప్రాంతాన్ని కాపాడాలని తీర ప్రాంత వాసులు కోరుతున్నారు. తుఫాన్లు వస్తుంటే తీర ప్రాంత ప్రజలు భయభ్రాంతులు చెందుతున్నారు. కెరటాల తాకిడికి సముద్రపు నీరు ఇళ్లల్లోకి రావడం ఈ టైం కి ఏమి జరుగుతుందని వారు నిద్రలేని రాత్రులు గడుపుతున్నామని మత్స్యకారులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికే కొన్ని వేల గృహాలు నేలమట్టం అయ్యాయి. రోజురోజుకీ సముద్రం ముందుకు రావడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ సమస్య ఇప్పుడు వచ్చిన ఎన్డీఏ ప్రభుత్వం త్వరగా సముద్రం ముందుకు రాకుండా అడ్డుగోట్టు వేయాలని లేనిచో రాబోయే రోజుల్లో భారీ నష్టం జరగవచ్చుని తీర ప్రాంత ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే భారీ నష్టం జరిగిందని గత ప్రభుత్వాలు ఈ సమస్యను పట్టించుకోలేదని. పట్టించుకున్నట్లయితే ఇంత నష్టం జరగకపోవచ్చునని. తుఫాన్ తాకిడికి బీచ్ రోడ్డు పూర్తిగా దెబ్బతింటుందని సముద్రం కెరటాలు రోడ్డుపైకి రావడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారని త్వరగా ఈ సమస్య తీర్చాలని వాహనదారులు కోరుతున్నారు.

# కృష్ణానగర్ గ్రామంలో ఉచిత మెడికల్ క్యాంపు






**పాములపాడు, జులై 11 (పీపుల్స్ మోటివేషన్):-**

పాములపాడు మండలంలోని కృష్ణానగర్ గ్రామంలో నంద్యాల జిల్లా సగర సేవా సంఘం ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించామని నిర్వాహకులు డాక్టర్ ఇమ్మడి అపర్ణ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సగర సేవా సంఘం స్థాపించిన తొలి వారంలోనే ఈ మెడికల్ క్యాంపు నిర్వహించడం ఎంతో సంతోషకరంగా ఉందని తెలిపారు. కృష్ణానగర్ గ్రామంలో కూడా ఇదే తొలి మెడికల్ క్యాంప్ అని తెలిపారు. మెడికల్ క్యాంపుకు సహకరించిన సగర వైద్య విభాగ కార్యదర్శి ఉప్పరి వెంకటేశ్వర్లుకు, రమేష్ బాబుకు వారు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సగర కుల గ్రామ పెద్దలు వెంకటేశ్వర్లు, ఆవులయ్య, జయకృష్ణ, రమణ, తిరుపాలు, గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. వైద్య శిబిరంలో 100 మందికి పైగా గ్రామస్తులకు ఉచితంగా పరీక్షలను నిర్వహించి మందులను పంపిణీ చేశామని డాక్టర్లు తెలిపారు. వైద్య శిబిరాన్ని జయప్రదం చేసినందుకు ఈ సందర్భంగా వారు గ్రామస్తులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

## చంద్రన్న బీమాను సద్వినియోగం చేసుకోండి

**బేతంచెర్ల, జూలై 11 (పీపుల్స్ మోటివేషన్):-**



చంద్రన్న బీమాను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర క్రిస్టియన్ సెల్ కార్యదర్శి మేకల నాగరాజు కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత సంవత్సరం మార్చి16 నుండి జూన్ 30 వరకు జరిగిన క్లైమ్ ల పరిష్కరం కొరకు ప్రభుత్వం చంద్రన్న బీమావెబ్ సైట్ ప్రారంభించిందని కావున WEA, WWDS వెబ్ సైట్ లోనమోదు చేసుకోవాలని కోరారు. డెత్ సర్టిఫికెట్,నామిని ఆధార్ కార్డు,బ్యాంక్ పాస్ బుక్ తీసుకొని సంబంధిత సచివాలయంలో నమోదు చేసుకోవాలని కోరారు.

## కల్తీ ఎరువులు మందులు అమ్మితే కఠిన చర్యలు

**మండల వ్యవసాయ అధికారి శ్రీకృష్ణ**



**నంద్యాల/రుద్రవరం, జులై 11 (పీపుల్స్ మోటివేషన్):-**

మండలంలోని ఆయా ఎరువులు మందులు దుకాణాలలో కల్తీ మందులు అమ్మితే కఠిన చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారి శ్రీకృష్ణ తెలిపారు. గురువారం మండలం లోని ఆలమూరు గ్రామంలో జాన్సీ ఆగ్రో ఏజెన్సీ అనే ఎరువులు పురుగుమందుల దుకాణం తనిఖీ చేసి స్టాక్ రిజిస్టర్స్ బిల్లు బుక్స్ తనిఖీ చేయడమైనది. నాణ్యత లేని, కల్తీ ఎరువులు పురుగు మందులు అమ్మినట్లయితే అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని లైసెన్సులు రద్దు చేయడం జరుగుతుంది అని తెలిపారు. అదేవిధంగా రసాయన ఎరువులు నాణ్యత ప్రమాణాలు పరిశీలించే నిమితమై పలు రకాల ఎరువులను సాంపిల్స్ సేకరించి ల్యాబ్ కి పంపించడం జరిగింది, ఈ కార్యక్రమం లో విస్తరణ అధికారి. రాజు పాల్గొన్నారు.

## ఈత చెట్లను నరికిన కాలువను ఛిద్రం చేసిన యాదవ కులానికి చెందిన వ్యక్తులు

**విచారణ జరిపిన ఇరిగేషన్ డిపార్ట్మెంట్ ఆఫీసర్ డిఈ కిరణ్**
**వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చిన అధికారులు**



**పెబ్బేరు, జులై 11 (పీపుల్స్ మోటివేషన్) :**

పెబ్బేరు మండల పరిధిలో రంగాపురం గ్రామంలో పాటు కాలువ ఒడ్డున ఉన్న ఈత, తాటి చెట్లను నరికి కాలువను ధ్వంసం చేసినందుకు పెండెం బాలయ్య కుటుంబ సభ్యులపై ఇరిగేషన్ డిపార్ట్మెంట్ డి ఈ కిరణ్ రంగాపురం గ్రామ రైతులు బుదవారం పిర్యాదు చేశారు. అట్టి ఫిర్యాదును స్వీకరించిన ఇరిగేషన్ అధికారులు డిఇ ఆధ్వర్యంలో అట్టి పాటు కాలువ,జాలు కాల్వ,దగ్గరికి వచ్చి విచారణ జరిపారు. కాలువను ధ్వంసం చేసిన వారిపై ఫిర్యాదు చేసి చట్టరితే చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడం జరిగింది. వివరాల్లోకి వెళితే,పెబ్బేరు మండల పరిధిలో రంగాపురం శివారులోని పాటు కాలువ ఒడ్డున ఉన్న ఈత చెట్లను రంగాపురం గ్రామం యాదవ కులానికి చెందిన పెండెం బాలయ్య,పెండెం రాజు,పెండెం వెంకటయ్య,పెండెం సత్యన్న,వారి కుటుంబ సభ్యులు జాలు కాల్వ ఒడ్డున ఉన్న ఈత చెట్లను నరికి వేయడం వల్ల పూర్తిగా ధ్వంసం అయినది ధ్వంసం అయినందున అట్టి కాల్వ కింద ఉన్న పొలాలకు నీరు అందవు అంతేకాక కుమ్మరి కుంట చెరువు కూడా నిండని పరిస్థితి ఏర్పడుతుంది. పై వ్యక్తులు కాలువ ఒడ్డున ఉన్న జాగను ఆక్రమించుకోవడానికి అట్టి చెట్లను కొట్టి వేయడం జరిగింది. ఇట్టి విషయంపై ఇరిగేషన్ డిపార్ట్మెంట్ డి ఈ కి గ్రామ రైతులు అందరు కలిసి ఫిర్యాదు చేశారు. ఇట్టి విషయంపై అధికారులు పూర్తి విచారణ జరిపి వారిపై తగు చర్యలు తీసుకుంటామని సూచించడం జరిగింది. గురువారం సంఘటన స్థలానికి ఇరిగేషన్ డిపార్ట్మెంట్ వచ్చి పరిశీలించారు. పాటు కాలువ ధ్వంసం ఆ కావడం నిజమేనని వారి నిర్ధారణలో తేలింది. ఇట్టి విషయంపై పై అధికారుల దృష్టికి తీసుకుపోయి తగు చర్యలు తీసుకుంటామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు.

తెలుగు దినపత్రిక
పీపుల్స్ మోటివేషన్
People's Motivation

# విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి

- జిల్లా పరిషత్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ లోతేటి శివ శంకర్
- బయాలజికల్ సైన్స్ ఉపాధ్యాయుడి పై ఆగ్రహం వ్యక్తం చేసిన కలెక్టర్
- మధ్యాహ్నం భోజనంలో ఉడకని బంగా ళదుంప కూర..వడ్డించడం పై కలెక్టర్ ఆగ్రహం



**బద్వేలు, జూలై 11 (పీపుల్స్ మోటివేషన్) :**
పాఠశాలలో చదివే ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యను అందించి 100 శాతం ఫలితాలను సాధించేందుకు చిత్తశుద్ధితో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ ఉపాధ్యాయులను ఆదేశించారు.బద్వేలు నియోజక వర్గం శ్రీ అవధూత కాశినాయన మండలం, నరసాపురంలోని జిల్లా పరిషత్ పాఠశాల, ప్రైమరీ హెల్త్ సెంటర్, తహశీల్దార్ ఆఫీసు, పోలీస్ స్టేషన్లను మండల అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా నరసాపురంలోని జిల్లా పరిషత్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.పదవ తరగతి విద్యార్థులకు ఉపాధ్యాయుడు బాల ఓబయ్య బోధించే బయాలజికల్ సైన్స్ క్లాస్ లో విద్యార్థుల మధ్యలో కూర్చుని ఆయనబోధించే పాఠ్య బోధనను విన్నారు. ఆ ఉపాధ్యాయుడు సరిగ్గా చెప్పడం లేదని గ్రహించిన కలెక్టర్ విద్యార్థులకు పాఠాలు చెప్పడానికి ముందు పూర్తి గా ప్రిపేర్ అయ్యి రావాలి కదా.. ఇలా చెప్తే విద్యార్థులకు ఏమి అర్థం అవుతుందని సంబంధిత ఉపాధ్యాయుడుపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు బోధించే ముందు ఉపాధ్యాయులందరు పాఠ్యాంశాలలోని వివిధ అంశాలపై ముందస్తుగా ప్రిపేర్ అయ్యి విద్యార్థులకు బోధించాలని అన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విద్యార్థులతో మమేకమై వారి జీవిత ఆశయ వివరాలు అడిగి తెలుసు కున్నారు. నిర్దేశించుకున్న లక్ష్య సాధన కోసం నిర్విరామంగా కృషి చేయాలన్నారు.క్రమశిక్షణ పట్టుదలతో ముందుకు సాగితే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చునని విద్యార్థులకు సూచిస్తు, తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలన్నారు. అనంతరం స్వయంగా ఆయన పిల్లలతో కలసి మధ్యాహ్న భోజనం చేశారు. బంగాల దుంప కర్రీ సరిగా ఉడకలేదని సంబంధిత ఇన్చార్జిలపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు ఇప్పటినుండి పద్ధతులు మార్చుకొని పిల్లలకు అందించే భోజనంలో మంచి ఆహారం అందించకపోతే సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.అనంతరం స్టాఫ్‌రూంలో టీచర్లతో సమావేశమై పాఠశాలలో అందిస్తున్న విద్యా ప్రమాణాలు, చదువులో వెనకబడిన విద్యార్థుల కోసం తీసుకోవలసిన జాగ్రత్తలు, మెరుగైన విద్యాప్రమాణాలు అందించేందుకు తీసుకుంటున్న, తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు జారీ చేశారుఅనంతరం ప్రైమరీ హెల్త్ సెంటర్, తహశీల్దార్ ఆఫీసు, పోలీస్ స్టేషన్లను సందర్శించి అక్కడ పనిచేసే సిబ్బందికి తమ సామర్థ్యాలను మెరుగుపరుచుకుని ప్రజలకు మెరుగైన సేవలను ఆలస్యం లేకుండా అందించాలని ఆదేశించారుఈ కార్యక్రమంలో జడ్పీ హైస్కూల్ హెడ్మాస్టర్, మండల రెవెన్యూ అధికారి,మండల విద్యాధికారి,పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

## సెల్ ఫోన్ దొంగల అరెస్టు

**హైదరాబాద్, జూలై 11 (పీపుల్స్ మోటివేషన్) :**
సెల్ఫోన్ దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు సభ్యుల ముఠాను లంగర్ హౌస్ పోలీసులు పట్టుకున్నారు. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం సాజిత్, సయ్యద్ హుస్సేన్, సయ్యద్ వాలిద్ హుస్సేన్ ఈ ముగ్గురు ఆటోను తీసుకొని దొంగతనాలకు పాల్పడుతున్నారని దొంగలించిన సెల్ ఫోన్ లను నిజామాబాద్ లోని సైయద్ రెహమతుల్లాకు అమ్ముతున్నారని సమాచారం అందుకున్న పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకున్నారు... వారి వద్ద నుండి సుమారు 30 సెల్ ఫోన్ లోనూ స్వాధీనం చేసుకున్నారు. ఒకరు ఆటో నడిపిస్తుంటే ఇద్దరు నిందితులు ఆటో వెనుకాల కూర్చుని వారు కూడా ప్యాసింజర్లల వ్యవహరిస్తూ మాయమాటలు చెప్పి ఈ దొంగతనాలకు పాల్పడుతున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు.... మహమ్మద్ సాజిద్ కు రిసీవర్ జైల్లో పరిచయం అయినట్లు పోలీసులు తెలిపారు.

## మైనర్ బాలిక హత్య కేసు...
## నిందితుడు ఆత్మహత్య



**విశాఖపట్నం, జూలై 11 (పీపుల్స్ మోటివేషన్) :**
రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టిం చిన అనకాపల్లి మైనర్ బాలిక హత్య కేసులో కీలక మలుపు చోటు చేసుకుంది. ఈ కేసులో నిందితుడు సురేష్ ఆత్మహత్య చేసుకున్నాడు. అందరూ అనుమానించినట్లుగానే నిందితుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. గత నాలుగు రోజులుగా నిందితుడి కోసం పోలీసులు 12 బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టారు. అయితే నిందితుడు ఫోన్ వాడకపోవడంతో అతడికి కనుగొనడం పోలీసులకు సవాల్గా మారింది. చివరకు రాంబిల్ల మండలం కొప్పుగుండు పాలెంలో నిందితుడు సురేష్ మృతదేహం లభ్యమైంది. కొప్పగొండ పాలెం పరిసరాలలో మృతదేహం బోర్లా పడి ఉండటాన్ని పోలీసులు గుర్తించారు. మృతదేహా న్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

## ఫాస్ట్ ఫుడ్స్ సెంటర్లు హోటల్లు తనిఖీ చేసిన అధికారులు



**బద్వేలు, జూలై 11 (పీపుల్స్ మోటివేషన్) :**
బద్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని పలు ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు హోటల్ లను ఆకస్మిక తనిఖీ చేసిన మున్సిపల్ కమిషనర్ ఫుడ్ సేఫ్టీ అధికారులు...ఫాస్ట్ ఫుడ్ మరియు హోటల్స్ లలో నిషేధిత ఫుడ్ కలర్స్ మరియు టేస్టింగ్ సాల్ట్ కల్తీ నూనెలు వాడుతూ ప్రజల ఆరోగ్యానికి దెబ్బతినేలా చేస్తున్నారని సమాచారంతోనే దాడులు నిర్వహించామని తెలిపిన కమిషనర్...ఈ దాడులలో నిషేధిత ప్లాస్టిక్ కవర్స్ స్పూన్స్ స్వాధీనం చేసుకున్నారు...ప్రజలు ఆరోగ్యం దెబ్బతినాలా చేసే ఫుడ్ కలర్స్ గాని నూనెలు కానీ వాడితే కఠినమైన చర్యలు తీసుకుంటామని ఫాస్ట్ ఫుడ్ సెంటర్స్ మరియు హోటల్ వారిని హెచ్చరించారు.

## ఆసుపత్రిని ప్రారంభించిన మంత్రి దామోదర రాజ నర్సింహ

**కూకట్ పల్లి, జూలై 11 (పీపుల్స్ మోటివేషన్) :**
కూకట్ పల్లి లో నూతనంగా ఏర్పాటు చేసిన అంకుర 120పడకల ఆసుపత్రిని తెలంగాణ వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నరసింహ గురువారం ప్రారంభించారు. మహిళలు, చిన్నారుల ఆరోగ్యమే ధ్యేయంగా నిర్మించిన అంకురా ఆసుపత్రి నీ ప్రారంభించినందుకు సంతోషంగా ఉందని మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రజలందరికీ నాణ్యమైన వైద్యం అందించే ఆసుపత్రులు నిర్మించడం శుభ పరిణామమని తెలిపారు. అంకూర ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ కృష్ణ ప్రసాద్ వున్నం మాట్లాడుతూ ... తెలంగాణ,ఆంధ్ర ప్రదేశ్,మహారాష్ట్ర,ఒరిస్సా రాష్ట్రాలలో మొత్తంగా 14ఇంటర్నేషనల్ ఆసుపత్రులు నెలకొల్పామని,2011 లో మొదటగా హైదారాబాద్,కూకట్ పల్లి లో ప్రారంభం అయిన ఆంకుర ఆసుపత్రి మరో బ్రాంచి నీ ఇక్కడే ప్రారంభించడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు.అన్ని వయస్సులు గల వారికి సేవలు అందించేందుకు అత్యంత సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన సామగ్రిని ఏర్పాటు చేశామని తెలిపారు.

## దాడిలో గాయపడిన వృద్ధుడు మృతి

**విశాఖపట్నం, జూలై 11 (పీపుల్స్ మోటివేషన్) :**
గోపాలపట్నం చంద్ర నగర్ లో నాలుగు రోజులు క్రితం జరిగిన దాడిలో 79 సంవత్సరాలు గల వృద్ధుడు వేచలపు దేవుడు మృతి చెందాడు. దాంతో కుటుంబసభ్యులు పెద్దదిక్కుని కోల్పోయారు. దాడి జరిగిన సంఘటన నుండి ఇంకా తేరుకోలేదు. అత్యంత కిరాతంగా తన తండ్రిని కొట్టాడని మృతుడి కుటుంబం కన్నీరు మున్నీరైయింది. గతంలో కూడా ముద్దాయి అక్రబోయిన శ్రీధర్, వారి కుటుంబ సభ్యులు వీధిలో ఉన్న వారిపై గొడవలు పడి భయభ్రాంతులకు గురి చేసే వారిని బాధితులు ఆరోపించారు. ముద్దాయి వారి కుటుంబం నుండి తమకు రక్షణ కల్పించాలంటూ ఆవేదన వ్యక్తం చేసారు. నిందితుడు బెయిల్ పై వస్తే తమకు ప్రాణహాని ఉందంటూ బాధితులు ఆందోళనలోవున్నారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలంటూ ప్రభుత్వాన్ని కోరారు.

## స్టీల్ ప్లాంట్ పై నివేదిక ఇస్తాను

### కేంద్రమంత్రి కుమార స్వామి

**విశాఖపట్నం, జూలై 11 (పీపుల్స్ మోటివేషన్) :**
విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణ అంశాన్ని కేంద్ర మంత్రి కుమారస్వామి తోసిపుచ్చారు. పరిశ్రమ పునరుద్దరణకు ప్రధానికి నోట్ సమర్పిస్తాను. ఈ ప్లాంట్ దేశ ఆర్థిక అభివృద్ధి కి సహాయపడుతుంది అని అర్థమైంది. అధ్యయనం కోసం స్టీల్ ప్లాంట్ కు వచ్చాను. ఇక్కడ పరిస్థితిని ప్రధానికి నివేదిస్తాను. కార్మిక కుటుంబాలు, జీవనోపాధి కోసం ఈ ప్లాంట్ పైన ఆధారపడి వాళ్ళ అభిప్రాయాలు నాకు అర్థం అయ్యింది. ఈ ప్లాంట్ ను పరిరక్షించడం మా బాధ్యత. ప్రధానమంత్రి అశీసులు, సహాయం తో ఈ ప్లాంట్ 100% సామర్థ్యం తో ఉత్పత్తి చేస్తుందని అన్నారు.

## అన్యమత పాలనపోయి గోవిందుడి పాలన వచ్చింది

**తిరుమల, జూలై 11 (పీపుల్స్ మోటివేషన్) :**
కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ గురువారం నాడు పుట్టినరోజు సందర్భంగా కుటుంబ సమేతంగా తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. తరువాత అయన మాట్లాడుతూ హాట్ కామెంట్స్ చేసారు. ఏపీలో గత పాలకులు వీరప్పన్ వారసులు. నిలువు నామాలతో ప్రజలకు పంగ నామాలు పెట్టారు. ఎర్రచందనం దోపిడీతో సర్కార్ కే అప్పులిచ్చే స్థాయికి ఎదిగారు. శేషాచల కొండల్లో ఎర్రచందనం దోపిడీపై నివేదిక కోరతాం. నాస్తికులకు, అన్యమతస్థులకు పదవులిచ్చి తిరుమల పవిత్రతకు భంగం కలిగించారు. నివేదిక ఆధారంగా జాతీయ సంపదను దోచుకున్న వారిపై చర్యలు తీసుకుంటామం. ఏడుకొండలను రెండు కొండలుగా మార్చాలనుకున్న అన్యమత పాలన పోయింది. అన్యమత పాలన పోయి గోవిందుడి పాలన వచ్చిందని అన్నారు.

## ట్యాంకర్ బోల్తా...

**పెద్దాపురం, జూలై 11 (పీపుల్స్ మోటివేషన్) :**
అత్యంత ప్రమాదకరమైన టోలిన్ లిక్విడ్ తో వెళ్తున్న టాంకర్ బోల్తా కొట్టిన ఘటన కాకినాడ జిల్లా పెద్దాపురం జంక్షన్ వద్ద చోటుచేసుకుంది. కాకినాడ పోర్ట్ నుండి హైదరాబాద్ కు వెళ్తున్న ట్యాంకర్ రోడ్డు పక్కన ఉన్న హై టెన్షన్ కరెంట్ స్తంభాన్ని ఢీ కొట్టి బోల్తా కొట్టింది. సమాచారం తెలుసుకున్న పెద్దాపురం పోలీసులు అగ్నిమాపక అధికారులకు సమాచారం ఇచ్చారు. అప్రమత్తమైన అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని పెను ప్రమాదం పొంచి ఉందని గ్రహించి మూడు అగ్నిమాపక శకటాలను సంఘటన స్థలంలో ఉంచారు. ఎటువంటి ప్రమాదం జరిగిన నివారణ చర్యలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని పెద్దాపురం అగ్నిమాపకధికారి జగన్నాధ రావు తెలిపారు. అయితే జన సంచారం లేని ప్రదేశం కావడంతో పెను ప్రమాదం తప్పిందని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే ట్యాంకర్ లో ఉన్న 11 టన్నుల లిక్విడ్ గాల్లో కలిసిందని ట్యాంకర్ లో ఉన్న 11 టన్నుల లిక్విడ్ ను ఎయిర్ ప్రెజర్ ద్వారా మరో ట్యాంకర్ కు డంప్ చేస్తున్నారు

## గాంధీ జయంతి రోజే పీకే కొత్త పార్టీ..

**న్యూఢిల్లీ, జూలై 11 (పీపుల్స్ మోటివేషన్) :**
ఎన్నికల వ్యూహకర్త, జన్ సూరజ్ యాత్ర కన్వీనర్ ప్రశాంత్ కిశోర్ తన కొత్త రాజకీయ పార్టీకి ముహూర్తం ఖరారు చేశారు. గాంధీ జయంతి అయిన అక్టోబర్ 2న అధికారికంగా ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. తాను చేపట్టిన జన్ సూరాజ్ యాత్రకి అక్టోబర్ 2 నాటికి రెండేళ్లు పూర్తవుతాయని తెలిపారు. వచ్చే ఏడాది జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీహార్ లోని మొత్తం 243 స్థానాల్లో పోటీ చేస్తామని స్పష్టం చేశారు.

## చీకటి ఒప్పందాలతో రూ.1200 కోట్ల కుంభకోణం

* సమైక్య పాలనలో ఆరోపణలు ఎదుర్కొన్న కాంట్రాక్టర్లకే పెద్దపీట
* చీకటి జీవోలతో సర్కాను నడిపిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
* కేంద్రం అమృత్ స్కీమ్ లో రూ. 3 వేల కోట్ల కాంట్రాక్టర్ల లో అవినీతి
* సీఎం సొంత జిల్లాలోనే మేఘ కృష్ణా రెడ్డి కి రూ .11 వందల కోట్ల కాంటాక్ట్స్
* మేఘ తో తెలంగాణ సొమ్ము కక్కిస్తాను అని చెప్పిన రేవంత్ రెడ్డి
* మళ్లీ మేఘా కే కాంట్రాక్ట్ ఇవ్వడం వెనుకున్న మతలబు ఏమిటి?
* మేఘ కృష్ణ రెడ్డి కి మీకున్న సంబంధం ఎంటి?
* నిధుల్లో జరిగిన అవినీతి పై ఈడి,సిబిఐ ఎంక్వైరీ చేపట్టాలి
* బీజేపీ శాసనసభాపక్షనేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి

**హైదరాబాద్, జూలై 11 (పీపుల్స్ మోటివేషన్) :**
రాష్ట్ర ప్రభుత్వం జీవోలను పబ్లిక్ డొమైన్ లో పెట్టకుండా చీకటి ఒప్పందాలతో కాంట్రాక్టర్లకు దోచిపెడుతోందని బీజేపీ శాసనసభాపక్షనేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆరోపించారు. గురువారం శాసనసభ ఆవరణలో మీడియా సమావేశం లో మాట్లాడుతూ లో రహస్య జీవోలతో సొంత జిల్లాలో సీఎం రేవంత్ రెడ్డి మేఘా కృష్ణారెడ్డికి రూ.1100 కోట్ల కాంట్రాక్ట్ పనులు ఇచ్చారని ఆరోపించారు. దీనిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.రాష్ట్ర ప్రభుత్వం చీకటి ఒప్పందాలు చేసుకొని జీవోలు తెచ్చి బలవంతపు వసూళ్లు చేస్తుందని అన్నారు. కేంద్రం నుంచి అమృత్ స్కీమ్ లో రూ. 3 వేల కోట్ల కాంట్రాక్టర్ల లో అవినీతి కి పాల్పడ్డారని ఆరోపించారు. దీన్ని మూడుగా డివైడ్ చేసి వెయ్యి కోట్లకు ఒక్కరిగా కాంట్రాక్టు ఇచ్చారన్నారు.. మేఘా కృష్ణారెడ్డికి రూ. 11 వందల కోట్ల ప్రాజెక్ట్ ఇచ్చారని తెలిపారు.ఎక్సైజ్ కుంభకోణంలో ఉన్న రేవంత్ బామ్మర్ది సృజన్ అనే వ్యక్తీ కి చెందిన శోధ కంపెనీకి రూ. 400 వందల కోట్ల కాంట్రాక్టర్ ఇచ్చారని మహేశ్వర్ రెడ్డి ఆరోపించారు. రూ. 600 కోట్లతో పూర్తి అయ్యే ప్రాజెక్ట్ ను వెయ్యి కోట్లకు ఇచ్చినట్లు చెప్పారు. 30 నుంచి 35 శాతం తక్కువకు పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు సిద్దంగా ఉన్నారని తెలిపారు. అంటే ఇష్టం వచ్చినట్టు ఎస్టిమేట్ పొంచి కాంటాక్ట్స్ ఇస్తున్నారని ధ్వజమెత్తారు. మొత్తం కలిపి రూ.1200 కోట్ల కుంభకోణం జరిగిందని ఆరోపించారు. ఏ ఒక్క జీవో ను కూడా ఎందుకు పబ్లిక్ డొమైన్ లో పెట్టడం లేదని ప్రశ్నించారు.మేఘా కృష్ణారెడ్డి మీద కాళేశ్వరం ఎంక్వైరీ రుగుతుంది కదా? ఆయన మీద జ్యుడీషియల్ ఎంక్వైరీ నడుస్తుందని అన్నారు.అలాంటప్పుడు ఆయన కంపెనీ నీ బ్లాక్ చేయకుండా కాంట్రాక్టు ఎలా ఇచ్చారు? అని మండిపడ్డారుమేఘా కృష్ణారెడ్డితో తెలంగాణ సొమ్ము కక్కిస్తాను చెప్పిన రేవంత్ రెడ్డి... మళ్ళీ ఆయనకు కాంట్రాక్ట్ ఇవ్వడం వెనకున్న మతలబు ఏమిటి? అని అనుమానం వ్యక్తం చేశారు.మేఘా కృష్ణారెడ్డికి మీకున్న సంబంధం ఏంటని ప్రశ్నించారు.ఇక కరీంనగర్ లో సీఎం తమ్ముడు పార్టనర్ అని చెప్తున్నారని చెప్పారు. రాబోయే కొడంగల్ టెండర్లలో కూడా మేఘా కు పెద్ద పీట వెయ్యబోతున్నారని అన్నారు. దీనికి ఎస్టిమేట్ ప్రయివేట్ ఇంజనీర్లు తో వేయించుకుంటున్నారని తెలిపారు. తాను అడిగిన ప్రశ్నలకు సీఎం రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.నిధుల్లో జరిగిన అవినీతి పై ఈడి,సిబిఐ ఎంక్వైరీ కొరతామని మహేశ్వర్ రెడ్డి తెలిపారు.

## భర్తను చంపించిన భార్య

**ఖమ్మం, జూలై 11 (పీపుల్స్ మోటివేషన్) :**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో చోటుచేసుకుంది. హత్య వెనుక దాగిఉన్న విస్తుపోయే నిజాలు పోలీసు విచారణలో ఒక్కొక్కటిగా ఆలస్యంగా బయటికొచ్చాయి. డీఎస్పీ షేక్ అబ్దుల్ రెహ్మాన్ తెలిపిన వివరాల ప్రకారం..కొత్తగూడెం పట్టణం గౌతంపూర్ కాలనీకి చెందిన అరికె రమేశ్ ఆటోడ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అదే ఏరియాలో నివాసం ఉంటోన్న సాహు ఈశ్వర్‌కుమార్ (38) భార్య ఎండీ రెహనాతో కొన్నాళ్ల క్రితం పరిచయం ఏర్పడింది. అది కాస్తా వివాహేతర సంబంధానికి



దారితీసింది. కొన్నాళ్ల క్రితం రెహనా భర్త ఈశ్వర్ కుమార్‌కు తెలిసి.. భార్యను నిలదీశాడు. ఈ విషయమై దంపతుల మధ్య తరచూ గొడవలు జరుగుతూ ఉండేవి. మరోవైపు రమేష్‌ను కూడా ఆ ఏరియా నుంచి తరిమేయాలనుకున్న ఈశ్వర్ అతని గురించి ఆరా తీశాడు. అ క్రమంలో రమేష్ సింగరేణి క్వార్టర్‌లో అక్రమంగా నివసిస్తున్నట్లు తెలుసుకుని, అతన్ని అక్కడ్నుంచి పంపించేయాలని నిశ్చయించుకున్నాడు. కొందరు స్థానికులతో కలిసి సింగరేణి అధికారులకు రమేష్‌పై ఫిర్యాదు చేశాడు. రంగంలోకి దిగిన అధికారులు రమేశ్ కుటుంబాన్ని క్వార్టర్స్ నుంచి ఖాళీ చేయించారు.మరోవైపు భర్త ఈశ్వర్ కుమార్ వేధింపులు తాళలేక రెహనా తన ప్రియుడు రమేశ్‌కు చెప్పింది. దీంతో ఇద్దరూ కలిసి ఎలాగైనా ఈశ్వర్ అడ్డు తొలగించుకోవాలని నిశ్చయించుకున్నారు. అతడితో కలిసి భర్త హత్యకు పథకం పన్నింది. ఈ క్రమంలో జులై 6న ఈశ్వర్ ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో అతనిపై రమేశ్, అతడి బంధువు బట్టు చందు కత్తులతో దాడిచేశారు. ఇదే సమయంలో ఎవరూ తమ ఇంటివైపు రాకుండా రెహనా ఇంటిబయట కాపలా కాసింది. గతంలో ఇల్లు ఖాళీ చేయించాడనే కక్షతోనే రమేష్ ఈ ఘాతుకానికి పాల్పడినట్లు స్థానికులు, కుటుంబ సభ్యులను నమ్మించింది. కత్తిపోట్లకు గురైన ఈశ్వర్‌ను వెంటనే ఖమ్మంలోని ఓ ఆసుపత్రిరి తరలించగా.. అతడు అక్కడ చికిత్స పొందుతూ మరుసటి రోజు మృతి చెందాడు. దీనిపై టూటౌన్ సీఐ రమేశ్‌కుమార్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. విచారణలో భాగంగా హతుడి భార్యపై అనుమానం వచ్చి ఆమెను విచారించగా మొత్తం కుట్ర బయటపడింది. రెహనాతోపాటు రమేష్, అతడి బంధువును పోలీసులు బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ వెల్లడించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న రమేష్‌కు భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

## ఆ ఐదుగురు అడ్డంగా బుక్కైయ్యారు

**కాకినాడ, జూలై 11 (పీపుల్స్ మోటివేషన్) :**
ఆంధ్రప్రదేశ్ లోని కాకినాడ పోర్టు నుంచి పెద్ద ఎత్తున బియ్యం స్మగ్లింగ్ జరిగిందని గతంలో టీడీపీ, జనసేన పార్టీలు చేసిన ఆరోపణలకు ఇప్పుడు బలమైన ఆధారాలు లభిస్తున్నాయి. పౌరసరఫరాల మంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి దూకుడుగా అక్రమాలను వెలికి తీస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్ తాజాగా కీలక ప్రకటన చేశారు. కాకినాడ నుంచి జరిగిన బియ్యం స్మగ్లింగ్‌లో ఐదుగురు ఐపీఎస్‌ల పాత్ర ఉన్నట్లుగా తనకు సమాచారం వచ్చిందన్నారు. ఒక్క కాకినాడలోనే 43వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సీజ్ చేశామంటే ఇక రాష్ట్ర వ్యాప్తంగా ఎంత భారీ స్థాయిలో అక్రమాలు జరిగి ఉంటాయో ఊహించడం కష్టమన్నారు. అధికారులు రాత్రింబవళ్లు సోదాలు నిర్వహిస్తున్నారు. మొత్తం బియ్యం స్కాం గుట్టు రట్టు చేస్తామని ప్రకటించారు. బియ్యం స్మగ్లింగ్‌లో ప్రధాన పాత్ర కాకినాడ సిటీ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డిదన్న ఆరోపణలు ఉన్నాయి. కాకినాడ పోర్టును ఆయన గుప్పిట్లో పెట్టుకున్నారని చెబుతున్నారు. అదే సమయంలో ఏపీ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ కు ద్వారంపూడి తండ్రే అధ్యక్షుడిగా ఉన్నారు. ఈ క్రమంలో ఐదేళ్ల పాటు పేదలకు ఇవ్వాల్సిన బియ్యాన్ని పక్కదారి పట్టించి ఆఫ్రికా దేశాలకు ఎగుమతి చేశారని భావిస్తున్నారు. కాకినాడలోనే ఎమ్మెల్యేకు చెందిన వివిధ గోడౌన్లలో సోదాలు నిర్వహించి పెద్ద ఎత్తున బియ్యాన్ని సీజ్ చేశారు. ఈ వ్యవహారంపై ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి ఇంకా ఏమీ మాట్లాడలేదు. గతంలో చేసిన స్మగ్లింగ్‌కు అధికార సహకారం పూర్తి స్థాయిలో ఉందని.. స్మగ్లింగ్ బియ్యాన్ని గ్రీన్ చానల్ ద్వారా తరలించేవారన్న ఆరోపణలు ఉన్నాయి. అధికారుల సహకారం లేకపోతే ఇంత భారీ స్థాయిలో అక్రమాలు జరగవని ఐదుగురు ఐపీఎస్ అధికారులు ఈ స్కాంలో భాగం అయి.. పూర్తి స్థాయిలో సహకరించి దానికి తగ్గట్లుగా ఫలితం పొందారని చెబుతున్నారు. దీనిపై ఇప్పటికే అధికార వర్గాల్లో గుసగుసలు ఉన్నాయి. ఇప్పుడు మంత్రి నాదెండ్ మనోహర్ నేరుగా ప్రకటించడంతో ఇక ఆ ఐదుగురు ఐపీఎస్ అధికారులపై కేసులు నమోదు చేయడం ఖాయమన అంచనా వేస్తున్నారు. పౌరసరఫరాల శాఖలో జరిగిన మొత్తం స్కాములన్నీ కొత్త మంత్రి బయటకు తీయిస్తున్నారు. పేదలకు పంపిణీ చేసే నిత్యావసర వస్తువుల ప్యాకెట్లలో బరువు తక్కువ ఉండటం కూడా గుర్తించారు. కాంట్రాక్టర్లు అధికారులు కుమ్మక్కయి ప్రజాధనాన్ని పెద్ద ఎత్తున స్వాహా చేశారని నిగ్గు తేలుస్తున్నారు. మంత్రి నాదెండ్ల దూకుడతో పౌరసరఫరాల శాఖలో చక్రం తిప్పిన వారు తంటాలు పడుతున్నారు. తమ స్కాములు ఎక్కడ బయటపడతాయోనని ఆందోళన చెందుతున్నారు.

## ప్రజల సమస్యే మా ప్రధాన ఎజెండా

**తాడేపల్లిగూడెం, జూలై 11 (పీపుల్స్ మోటివేషన్) :**
ప్రజల సమస్యే తమ ప్రభుత్వ ప్రధాన ఎజెండా అని తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. పట్టణంలోని నన్నయ యూనివర్సిటీ నుంచి ఎన్ హెచ్ 16 అండర్ పాస్ వరకు వెళ్లే సిసి రోడ్డు నిర్మాణం, ఏరియా ఆసుపత్రి తూర్పు గేటు సిసి రోడ్, అగ్గిపెట్టెల కంపెనీ వద్ద సిసి రోడ్డు నిర్మాణాలకు శుక్రవారం ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం పది వేల మంది విద్యార్థులు గణేష్ నగర్ రహదారి గుండా రాకపోకలు సాగిస్తారన్నారనీ వారందరి ఆకాంక్ష మేరకు ఈ రహదారిని నిర్మిస్తున్నట్లు తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వంలో కొంతమంది తమ పొలాల వద్దకు ఇక్కడ రహదారి నిర్మించాలని ప్రయత్నించారన్నారు. తాను మున్సిపల్ చైర్మన్ గా ఉన్న సమయంలోనే ఈ రహదారిని మంజూరు చేయించామని గుర్తు చేశారు. అయితే తాను గతంలో మున్సిపల్ చైర్మన్ గా ఉన్న సమయంలో అప్పుడే జిల్లా పరిషత్ చైర్మన్ ముల్లపూడి బాపిరాజు సహకారంతో ఈ రోడ్డు నిర్మాణం చేపట్టే ప్రయత్నం చేసినా అప్పటికే ఎన్నికలు రావడంతో రోడ్డు నిర్మాణం నిలిచిపోయిందన్నారు.ఈ రహదారికి కొండలమ్మ ఆలయం, ఎస్వీఆర్ సర్కిల్ వరకు అవుట్ లెట్ నిర్మిస్తామన్నారు. పట్టణ ప్రజలకు మూడు పూటల నీరందించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రహదారులను ఆక్రమించవద్దని, వ్యాపారులు సహకరించాలని కోరారు. త్వరలోనే తాడేపల్లిగూడెంకు క్రికెట్ స్టేడియం మంజూరు కాబోతుందన్నారు. టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ వలవల బాబ్జి, బీజేపీ నేత ఈతకోట తాతాజీ, శశి విద్యాసంస్థల అధినేత బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ మాట్లాడారు. ఏపీ నిట్ రిజిస్ట్రార్ దినేష్ శంకర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ జి మురళీ కృష్ణ, కాళ్ళ గోపి, గురుజు సూరిబాబు, డిప్యూటీ ఇంజనీర్, అసిస్టెంట్ ఇంజనీర్ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తెలుగు దినపత్రిక
# పీపుల్స్ మోటివేషన్
People's Motivation
శుక్రవారం | జులై | 12 | 2024



## తెలంగాణలో గ్రూప్ 2, 3 పరీక్షలు వాయిదా వేశారా




**హైదరాబాద్, జులై 11 (పీపుల్స్ మోటివేషన్) :**
తెలంగాణలో గ్రూప్ 2, గ్రూప్ 3 పరీక్షలు వాయిదా వేయాలని అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు. పోస్టులు పెంచి ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని నిరుద్యోగులు కోరుతున్నారు. ఈ క్రమంలో తెలంగాణ ప్రభుత్వం అభ్యర్థుల రిక్వెస్ట్‌ను పరిగణన లోకి తీసుకుని ఎగ్జామ్ రీషెడ్యూల్ చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు ప్రచారం జరిగింది. రీ షెడ్యూల్ అయిన తెలంగాణ గ్రూప్ 2, గ్రూప్ 3 ఎగ్జామ్ డేట్లు అని ఓ ప్రకటన సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది. ఆ నోటీసుపై టీజీపీఎస్సీ అధికారులు స్పందించారు.తెలంగాణలో త్వరలో జరగనున్న గ్రూప్ 2, గ్రూప్ 3 పరీక్షల తేదీలు మార్చేందుకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో వైరల్ ప్రకటనలో వాస్తవం లేదని, అదంతా ఫేక్ న్యూస్ అని టీజీపీఎస్సీ క్లారిటీ ఇచ్చింది. అభ్యర్థులు వాటిని నమ్మకూడదని, అధికారిక ప్రకటనల్ని మాత్రమే విశ్వసించాలని సూచించింది. గ్రూప్ 2 ఎగ్జామ్ ఆగస్టులో జరగాల్సి ఉండగా, నవంబర్ 17, 18 తేదీలలో నిర్వహించడానికి టీజీఎస్సీ రీషెడ్యూల్ చేసిందని ప్రచారం జరిగింది. అదే విధంగా గ్రూప్ 3 ఎగ్జామ్ నవంబర్ 24, 25 తేదీలకు వాయిదా వేసినట్లు టీజీపీఎస్సీ పేరుతో ఓ ప్రకటన వైరల్ అయింది. దానిపై టీజీపీఎస్సీ స్పందించి క్లారిటీ ఇచ్చింది. గ్రూప్ 2, గ్రూప్ 3 నియామక పరీక్షలను వాయిదా వేయలేదని, అభ్యర్థులు ఇలాంటివి నమ్మవద్దని సూచించారు.తెలంగాణలో మొత్తం 783 గ్రూప్–2 ఉద్యోగాల భర్తీకి రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ 29 డిసెంబర్ 2022న నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ పోస్టులకు మొత్తం 5,51,943 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, ఒక్కో పోస్టుకు దాదాపు 700 మంది చొప్పున పోటీ నెలకొంది. గత ఏడాది నవంబర్ నెలలో గ్రూప్ 2 ఎగ్జామ్ నిర్వహించాల్సి ఉండగా, ఎన్నికలు రావడంతో వాయిదా వేశారు. తాము అధికారంలోకి రాగానే జనవరిలో గ్రూప్ 2 ఎగ్జామ్స్, వెంటనే గ్రూప్ 3 సైతం నిర్వహిస్తామని అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం చెప్పింది. అసెంబ్లీ ఎన్నికలు జరగడం, బీఆర్ఎస్ ఓడిపోవడం జరిగిపోయాయి. కాంగ్రెస్ తెలంగాణలో తొలిసారి అధికారంలోకి రాగా, జనవరిలో నిర్వహించాల్సిన గ్రూప్ 2 ఎగ్జామ్ వాయిదా వేశారు. టీజీపీఎస్సీ కొత్త చైర్మన్ గా మాజీ డీజీపీ మహేందర్ రెడ్డిని నియమించి పోస్టుల భర్తీపై ఫోకస్ చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. ఆగస్టు 7, 8 తేదీల్లో గ్రూప్–2 పరీక్ష నిర్వహించాల్సి ఉంది. కానీ పోస్టులు పెంచడంతో పాటు పరీక్షను వాయిదా వేసి, రీషెడ్యూల్ చేయాలన్న డిమాండ్ వస్తోంది. అభ్యర్థులు టీజీపీఎస్సీ కార్యాలయం ముట్టడికి పిలుపునివ్వడంతో పాటు ఉస్మానియా యూనివర్సిటీ సహా వీలున్న చోట నిరసన తెలుపుతున్నారు. డీఎస్సీ సైతం పోస్టులు పెంచాలని, పరీక్షలు వాయిదా వేసి పకడ్బందీగా నిర్వహించాలని కోరుతున్నారు. మహిళా అభ్యర్థులు సైతం రాత్రి అని చూడకుండా ఓయూ వద్ద నిరసన తెలిపారు. సిలబస్ చాలా పెంచారని, తక్కువ సమయంలో సబ్జెక్ట్ చదవడం పూర్తి కాదని, ప్రభుత్వం తమ సమస్యల్ని పట్టించుకోవాలన్నారు.

### హుజురాబాద్ ఎమ్మెల్యేకు..
## వాస్తు భయం

**కరీంనగర్, జులై 11 (పీపుల్స్ మోటివేషన్) :**
కరీంనగర్ జిల్లా హుజురాబాద్ ఎమ్మెల్యే క్యాంపు పనులు ప్రారంభం అయ్యాయి. ఇటీవలే నిర్మించిన ఈ భవనానికి సిట్టింగ్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి మరమ్మత్తులు చేయించడం చర్చనీయాంశంగా మారింది. అయితే ఈ భవనానికి వాస్తు బాగా లేకపోవడం వల్లే అపశృతులు చోటు చేసుకుంటున్నాయని భావించి, వాటికి అనుకూలంగా మరమ్మత్తులు చేయిస్తున్నారన్న ప్రచారం సాగుతోంది.హుజూరాబాద్ నుండి అప్రతిహతంగా గెలుస్తున్న ఈటల రాజేందర్ ఈ క్యాంపు అందుబాటులోకి షిఫ్ట్ అయిన తరువాత ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్నారనే వాదన స్థానికంగా వినిపిస్తోంది. కొత్తగా నిర్మించిన ఈ భవనంలోకి మారిన తరువాత మంత్రివర్గంలో స్థానం కోసం ఊగిసలాడడం, ఆ తర్వాత పార్టీ నుంచి బయటకు రావడం, ఉప ఎన్నికలకు వెల్లడం, జనరల్ ఎన్నికల్లో ఓటమి పాలు కావడం వంటి చర్యలు కూడా క్యాంప్ కార్యాలయానికి వాస్తు లేకపోవడమేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.క్యాంపు ఆఫీసుకు సమీపంలో విద్యుత్ సబ్ స్టేషన్ ఉండటంతో పాటు భవనంలోని డోర్లు ఏర్పాటు చేయాల్సిన చోట చేయకపోవడం వల్ల ఇందులో నివసించే వారికి భవిష్యత్తులో ఆటంకాలు ఎదురవుతాయన్న వాదనలు బలంగా వినిపించాయి. దీంతో ఈసారి ఎన్నికల్లో గెలిచిన కౌశిక్ రెడ్డి క్యాంప్ ఆఫీసులో కార్యకలాపాలు కొనసాగేందుకు వెనక ముందు ఆలోచించారని పార్టీ వర్గాలు అంటున్నాయి. ఈ నేపథ్యంలోనే హుజురాబాద్ ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసు భవనంలోనే మరమ్మత్తులు ప్రారంభం కానున్నాయి.భవనాన్ని వాస్తుకు అనుగుణంగా సెట్ చేసిన తరువాత సిట్టింగ్ ఎమ్మెల్యే గృహ ప్రవేశం చేయనున్నట్టు సమాచారం. అందుకే గెలిచి ఆరు నెలలు అవుతున్న ఇప్పటి వరకు క్యాంపు ఆఫీస్ లో అడుగు పెట్టలేదట. విశాలంగా క్యాంపు ఆఫీస్ ఉన్నప్పటికీ.. ఇక్కడికి మాత్రం రావడం లేదట. వీణవంక తన స్వంత ఇంట్లోనే బస చేస్తున్నారు ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి. మరోవైపు మంచిగా ఉన్న క్యాంపు ఆఫీస్ కి మరమ్మతులు చేయించడంపై విమర్శలు వస్తున్నాయి. మొత్తానికి రాజకీయ పార్టీ నేతలకు వాస్తు భయం పట్టుకుంది. ఈ విషయం గురించి మాట్లాడానికి కౌశిక్ నిరాకరిస్తున్నారు.



## గంజాయి స్వాధీనం


**చింతూరు, జులై 11 (పీపుల్స్ మోటివేషన్) :**
అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం మోతుగూడెం పోలీస్ స్టేషన్ వద్ద చింతూరు సిఐ గజేంద్ర కుమార్,ఎస్సై గోపాలరావు వాహనాలు తనిఖీ చేపడుతుండగా 800 కేజీల గంజాయిని పట్టుకోవడం జరిగింది.ఈ గంజాయికి సంబంధించిన వివరాలను చింతూరు ఏఎస్పీ రాహుల్ మీనా మీడియా సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు.గంజాయిని తరలిస్తున్నట్టు పోలీసు అధికారులకు సమాచారం రావడంతో మోతుగూడెం పోలీస్ స్టేషన్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు.ఈ సమయంలో అటుగా వస్తున్న ఐచర్ వాహనాన్ని తనిఖీ చేయగా అందులో 550 కేజీల గంజాయిని గుర్తించారు.ఈ ఘటనలో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేయడం జరిగింది.అలాగే ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నట్లు తెలిపారు.మరో ఘటనలో కారులో తరలిస్తున్న 250 కేజీల గంజాయిని పోలీసులు గుర్తించారు.ఈ ఘటనలో ఒకరిని అరెస్టు చేశారు.మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు తెలిపారు.రెండు వేరు వేరు ఘటనలో పట్టుబడ్డ 800 కేజీల గంజాయి విలువ సుమారు 40 లక్షల రూపాయలు ఉంటుందని ఏఎస్పీ రాహుల్ మీనా తెలిపారు.గంజాయిని పట్టుకున్న చింతూరు సిఐ గజేంద్ర కుమార్,ఎస్సై గోపాల రావు లను ఏఎస్పీ రాహుల్ మీనా అభినందించారు.

# హైదరాబాద్ లో భారీగా ఫ్లూ కేసులు



- నగరంలో పెరుగుతున్న వైరల్ ఫ్లూ కేసులు
- 600 నుంచి 800 వైరల్ ఫ్లూ, సీజనల్ కేసులు నమోదు
- వైరల్ ఇన్ఫెక్షన్ వల్లనే ప్రజలు జ్వరం, జలుబు, తలనొప్పి, దగ్గు వంటి సమస్యలు
- అనుమానాలు ఉంటే వెంటనే డాక్టర్ ను సంప్రదించాలంటున్న వైద్యులు
- జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్న వైద్యులు
- అందుబాటులో మార్కెట్ లో ఫ్లూ శాట్ వ్యాక్సిన్

**హైదరాబాద్, జులై 11 (పీపుల్స్ మోటివేషన్) :**
హైదరాబాద్ నగరంలో గత కొన్ని రోజులుగా వైరల్ ఫ్లూ కేసులు క్రమంగా పెరుగుతూ వస్తున్నాయి. గత వారం రోజులుగా రోజుకు సగటున 600 నుంచి 800 వైరల్ ఫ్లూ మరియు సీజనల్ కేసులు హైదరాబాద్ లో నమోదవుతున్నాయి. ఎక్కువ శాతం జ్వరం,జలుబు మరియు దగ్గు సమస్యలతో బాధపడుతున్న పేషంట్లు ఆస్పత్రుల బాట పడుతున్నారు. అయితే సాధారణ జ్వరం,జలుబును చూసి కూడా ప్రజలు సీజనల్ ఫ్లూ, ఇన్ఫ్లుఎంజా, లేదా ఇతర వైరల్ ఇన్ఫెక్షన్ కేసులా అని ప్రజలు భయపడుతూ ఆస్పత్రులకు వస్తున్నారు. ఇదిలా ఉంటే తెలియని వైరల్ ఇన్ఫెక్షన్ వల్లనే ప్రజలు జ్వరం, జలుబు, తలనొప్పి మరియు దగ్గు వంటి సమస్యలతో బాధపడుతున్నారని వైద్యులు చెబుతున్నారు.కాగా ఈ వైరల్ ఇన్ఫెక్షన్ సోకిన వారు సకాలంలో వైద్యులను సంప్రదించకపోతే తీవ్రమైన న్యుమోనియా సహా శ్వాశకోశ సమస్యకు దారితీస్తుందని డాక్టర్లు చెబుతున్నారు. ఇండియన్ ఆఫ్ మెడికల్ రీసెర్చ డేటా ప్రకారం.....గతేడాది కూడా హైదరాబాద్ నగరంలో ఇదే తరహాలో ఇన్ఫ్లుఎంజా ( H1N1), ( H3N2) కేసులు నమోదు అయ్యాయి. యశోదా ఆస్పత్రికి చెందిన జనరల్ ఫిజషన్ డాక్టర్ సోమనాథ్ కుమార్ మాట్లాడుతూ.......రోజు చూస్తున్న కేసుల్లో ఎక్కువ శాతం నీటి ద్వారా వచ్చే వ్యాధులే ఉన్నాయని ఆయన చెప్పారు. వాటితో పాటు చికెన్ పాక్స్, డిప్తేరియా, మీజిల్స్, వంటి కేసులు అధికంగా వస్తున్నాయన్నారు. కాగా కొన్ని సందర్భాల్లో ఈ వ్యాధులు ఎగువ, దిగువ శ్వాస నాళాలపై ప్రభావం చూపుతాయని వెల్లడించారు. అరుదైన సందర్భాల్లో ఈ వ్యాధులు ఊపిరితిత్తులను కూడా తీవ్రంగా ప్రభావితం చేస్తాయని తెలిపారు. హైదరాబాద్ కు చెందిన ఇమునాలజిస్ట్ డాక్టర్ గీత దేవి మాట్లాడుతూ.....గత పది రోజులుగా ఎక్కువ శాతం ఇన్ఫెక్షన్ కేసులను మనం చూస్తున్నాం. కరోనా తరువాత ప్రజల్లో ఇమ్యూనొలాజికల్ మార్పుల తరువాత ఇప్పుడు సాధారణ ఫ్లూ కూడా ఇప్పుడు శ్వాస ఇన్ఫెక్షనలుగా మారుతుంది. ఈ పెరుగుదల న్యుమోనియా వ్యాధికి దారి తీస్తుందని ఆమె తెలిపారు.జ్వరం,జలుబు,దగ్గు,గొంతు నొప్పి,శరీరా నొప్పులు, కండ్లకలక, తుమ్ములు, ముక్కు దిబ్బడ, చాతీ నొప్పి, నీరసం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు వంటి లక్షణాలు లేదా వ్యాధులు మూడు రోజులు కంటే ఎక్కువగా ఉన్నాయంటే వెంటనే సమీప ఆరోగ్య కేంద్రంలో వైద్యుడిని సంప్రదించాలని వైద్యులు సూచిస్తున్నారు. వైరల్ ఇన్ఫెక్షన్ తో బాధపడుతున్న వ్యక్తులతో ఆహారం, నీరు, బట్టలు పంచుకోకపోవడం మంచిది. తరుచూ చేతులు శుభ్రం చేసుకోవాలి. వీలైతే హ్యాండ్ సానిటిజర్ వాడాలి. తుమ్మేటప్పుడు లేదా దగ్గేటప్పుడు మోచేతి అడ్డు పెట్టుకోవాలి. ముఖ్యంగా చిన్న పిల్లలు, వృద్ధులు, గుండె లేదా మూత్రపిండాల సమస్యలు ఉన్న వారు ఎక్కువ జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచనలు చేస్తున్నారు. మార్కెట్ లో ఫ్లూ శాట్ వ్యాక్సిన్ అందుబాటులో ఉందని, ఏడాదికి ఒక సారైనా ఆ వ్యాక్సిన్ తీసుకోవడం మంచిదని వైద్యులు చెబుతున్నారు.





## రాజ్యసభ సీటు కోసం వీహెచ్ ప్రయత్నాలు

**హైదరాబాద్, జులై 11 (పీపుల్స్ మోటివేషన్) :**
తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో పదుల లొల్లి అంతకంతకూ పెరుగుతూనే ఉంది. మంత్రి పదవులు, పీసీసీ చీఫ్ స్థానాలను ఇప్పటి వరకూ భర్తీ చేయలేకపోయారు. తాజాగా కాంగ్రెస్ లో చేరిన కేకే రాజీనామాతో ఖాళీ అయిన రాజ్యసభ స్థానం కోసం రేస్ ప్రారంభమయింది. ఆ స్థానం తనకే ఇవ్వాలని సీనియర్ నేత వీ హనుమంతరావు డిమాండ్ చేశారు. గాంధీ భవన్‌లో ప్రెస్ మీట్ పెట్టిన ఆయన.. లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ ఎంపీ టికెట్ తనకు ఇస్తే గెలిచేవాడినని కానీ తనకు టిక్కెట్ విషయంలో అన్యాయం చేశారన్నారు.ఎనిమిదేళ్లుగా తనకు ఎలాంటి పదవీ లేదని ఆయినా పార్టీ విజయానికి కృషి చేసానని తెలిపారు. త్వరలో రాజ్యసభకు జరగనున్న ఉపఎన్నికల్లో తనకు అవకాశం కల్పించాలని పార్టీ హైకమాండ్ కు విజ్ఞప్తి చేసారు. కేకే రాజీనామా చేయడం వల్ల ఒక్క రాజ్యసభ స్థానం ఖాళీ అయింది. ఇప్పుడు ఉపఎన్నికలు నిర్వహిస్తే ఆ స్థానాన్ని కాంగ్రెస్ పార్టీ గెలుచుకుంటుంది. అందుకే వీ హనుమంతరావు ముందుస్తుగానే గాంధీభవన్ లోనే ప్రెస్ మీట్ పెట్టి తన కోరికను వ్యక్తం చేశారు. అయితే తన రాజ్యసభ స్థానాన్ని మళ్లీ తనకు ఇచ్చే షరతుల మీదనే కేకే పార్టీ మారారాన్న ప్రచారం ఉంది. ఈ విషయంపై కాంగ్రెస్ వర్గాలు ధృవీకరించడం లేదు . కానీ పార్టీ మారగానే కేకే రాజీనామా చేయాల్సిన అవసరం లేదని ఇంకా చెప్పాలంటే..ఆయన పార్టీలో చేరాల్సిన అవసరం కూడా లేదని అంటున్నారు. పార్టీ మారకుండానే పార్టీ నేతగా చెలామణి కావొచ్చు.. ఆయన కుమార్తె హైదరాబాద్ మేయర్ ఇప్పటికే పార్టీ మారిపోయారు. కానీ విలువలు కాపాడినట్లుగా ఉంటుందని అలాగే.. తన రాజ్యసభ సీటు తనకు వస్తుందన్న నమ్మకంతోనే కేకే రాజీనామా చేసినట్లుగా తెలుస్తోంది. కేకే అలా రాజీనామా చేయగానే ఇలా సీఎం రేవంత్ రెడ్డి ఆయనకు సలహాదారు పదవి ఇచ్చారు. కేబినెట్ హోదా కూడా ఇచ్చారు. ఈ కారణంతో ఆయన కాళీ చేసిన రాజ్యసభ సీటు ఆయనకు ఇవ్వకపోవచ్చన్న ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో వీ హనుమంతరావు తన ప్రయత్నం తాను చేసుకోవడానికి తెర ముందుకు వచ్చినట్లుగా చెబుతున్నారు. ఒకప్పుడు ఏఐసిసిలో ప్రముఖ నేతగా ఉన్న వీహెచ్ ఇప్పుడు ప్రాధాన్యం కోల్పోయారు. సీనియర్ నేతగా ఆయనకు గుర్తింపు ఇస్తున్నా.. పదవుల గురించి మాత్రం ఆయన పేరును పరిగణనలోకి తీసుకోవడం లేదు



తెలుగు దినపత్రిక
పీపుల్స్ మోటివేషన్
People's Motivation

# చిక్కుల్లో సిద్ధిరామయ్య

- కర్ణాటకలో రాజకీయ దుమారం
- సీఎం సిద్ధిరామయ్య, ఆయన కుటుంబంపైన తీవ్ర ఆరోపణలు
- మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ -ముడా కుంభకోణం కర్ణాటకలో తీవ్ర చర్చనీయాంశం
- మైసూర్ కలెక్టర్, ఇతర అధికారుల పాత్ర ఉందని ఫిర్యాదు
- భూ కుంభకోణం బయటకు రావాలంటే రిటైర్డు జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్
- బీజేపీ నేతల ఆరోపణలపై స్పందించిన సిద్ధిరామయ్య

**బెంగళూరు, జూలై 11 (పీపుల్స్ మోటివేషన్) :**
కర్ణాటకలో మరోసారి తీవ్ర రాజకీయ దుమారం రేగింది. ఈసారి ఏకంగా సీఎం సిద్ధరామయ్య, ఆయన కుటుంబంపైనే తీవ్ర ఆరోపణలు రావడం పెను సంచలనంగా మారింది. మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ –ముడా కుంభకోణం కర్ణాటకలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ ముడా కుంభకోణంలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఆయన కుటుంబానికి పాత్ర ఉందని ఆరోపిస్తూ.. ఓ సామాజిక కార్యకర్త పోలీసులను ఆశ్రయించారు. ఈ నేపథ్యంలోని మైసూరులోని విజయనగర్ పోలీస్ స్టేషన్‌లో సామాజిక కార్యకర్త స్నేహమయి కృష్ణ ఫిర్యాదు చేశారు.ముడా కుంభకోణంలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఆయన సతీమణి పార్వతమ్మ, కుమారుడు కర్ణాటక ఎమ్మెల్సీ యతీంద్ర కూడా ఉన్నారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. వీరితో పాటు మొత్తం 9 మందిపై పోలీసులకు ఫిర్యాదు అందింది. మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ కుంభకోణం సీఎం సిద్ధరామయ్య కనుసన్నల్లోనే జరిగిందని ఇప్పటి వరకు ప్రతిపక్షాలు తీవ్ర ఆరోపణలు గుప్పిస్తున్న విషయం తెలిసిందే. ఈ ముడా స్కామ్ ద్వారా కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య భార్య పార్వతమ్మ.. భారీగా లబ్ధి పొందారని తాజా ఫిర్యాదులో ఆరోపించారుముడా భూ కేటాయింపుల కుంభకోణంలో సిద్ధరామయ్య భార్య పార్వతమ్మ, ముడా అధికారులతోపాటు మైసూరు జిల్లా కలెక్టర్, ఇతర ప్రభుత్వ అధికారుల పాత్ర ఉందని స్నేహమయి కృష్ణ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో వెల్లడించారు. వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదుదారుడు డిమాండ్ చేశారు. అయితే ముడా అవకతవకలపై ఇప్పటికే దర్యాప్తు కొనసాగుతోందని వెల్లడించిన మైసూరు పోలీసులు.. ఈ ఫిర్యాదుపై ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోవడం గమనార్హం.సీఎం సిద్ధరామయ్య, ఆయన కుమారుడు యతీంద్ర రూ. 4 వేల కోట్ల భూ కుంభకోణానికి పాల్పడ్డారని కర్ణాటక బీజేపీ నేతలు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. సీఎం సొంత జిల్లా మైసూరులో తన భార్య పార్వతమ్మ పేరుమీద చట్టవిరుద్ధంగా రూ.కోట్ల విలువ గల భూములను కేటాయించుకున్నారని.. బీజేపీ నేత ఆర్ అశోక్ తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ కుంభకోణంలో మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఉన్నతాధికారుల ప్రమేయం కూడా ఉందని వాదిస్తున్నారు. అయితే ఈ కుంభకోణం విషయం బయటికి రాకుండా ఉండేందుకు.. ఆ అధికారులను సిద్ధరామయ్య సర్కార్ ఆగమేఘాల మీద ట్రాన్స్‌ఫర్ చేసిందని ఆరోపించారు. ఈ భూ కుంభకోణం వివరాలు పూర్తిగా బయటికి రావాలంటే సీబీఐ లేదా రిటైర్డ్ జడ్జితో విచారణ జరిపించాలని బీజేపీ డిమాండ్ చేస్తోంది.బీజేపీ నేతలు చేస్తున్న ఆరోపణల ప్రకారం.. మైసూరు నగర శివార్లలోని గ్రామీణ ప్రాంతాల్లో సీఎం సిద్ధరామయ్య భార్య పార్వతమ్మకు 3 ఎకరాల 16 గుంటల భూమి ఉంది. అయితే ఆ భూములను సేకరించిన కర్ణాటక ప్రభుత్వం.. వాటికి బదులుగా మైసూరు నగరంలోపల అత్యంత ఖరీదైన ప్రాంతాలైన విజయనగర్, దట్టగల్లీ, జేపీ నగర్, ఆర్టీ నగర్, హంచయా–సతాగల్లీలో.. భూములను కేటాయించింది.



అయితే గ్రామీణ ప్రాంతాల్లో ఎకరం భూమిని ప్రభుత్వం సేకరిస్తే.. నగరంలో అర ఎకరం భూమిని కేటాయించారు. అయితే ముఖ్యమంత్రి కుటుంబానికి అత్యంత ఖరీదైన ప్రాంతాల్లో భూములను కేటాయించాలని ఎవరు సిఫారసు చేశారని బీజేపీ నేత ఆర్ అశోక్ ప్రశ్నించారు. మంత్రివర్గం అనుమతి లేకుండా భూములు కేటాయించే అధికారం ఎవరికి ఉంటుందని.. ముఖ్యమంత్రికి తెలియకుండానే ఇంత భారీ కుంభకోణం జరిగిందా అని నిలదీశారు. అయితే ముడా భూ కుంభకోణం గురించి బీజేపీ నేతలు చేస్తున్న ఆరోపణలపై సీఎం సిద్ధరామయ్య స్పందించారు. ఆరోపణలను ఖండించిన ముఖ్యమంత్రి.. తమ కుటుంబానికి ఆ భూములను ఎవరు, ఎలా కేటాయించారో తనకు తెలియదని వెల్లడించారు. అయితే ఈ భూ కేటాయింపులు బీజేపీ ప్రభుత్వ హయాంలోనే జరిగినట్లు తెలిపారు. రింగ్‌రోడ్డుకు సమీపంలో తన భార్య పేరుమీద 3.16 ఎకరాల భూమి ఉన్నది నిజమేనని పేర్కొన్నారు. తమ భూమిని సేకరించకుండానే ముడా అధికారులు అక్కడ లే అవుట్ వేసి.. లబ్ధిదారులకు పంపిణీ చేసినట్లు వివరించారు. చట్ట ప్రకారం తమ భూములకు బదులుగా వేరేచోట భూములు ఇస్తామని ముడా అంగీకరించిందని.. అందులో తప్పేముందని ప్రశ్నించారు. ఇదంతా బీజేపీ అధికారంలో ఉన్నప్పుడే జరిగిందని స్పష్టం చేశారు.

## తిరుమలలో మొదలైన ప్రక్షాళన

**తిరుమల, జూలై 11 (పీపుల్స్ మోటివేషన్) :**



తిరుమల.. కలియుగ వైకుంఠం. దేశవ్యాప్తంగానే కాకుండా ప్రపంచమంతా భక్తులున్న దివ్యక్షేత్రం. శ్రీనివాసుడు ఆపద మొక్కులవాడు. కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారం. అందుకే ఆ కలియుగ దైవం దర్శనం కోసం .. ఎక్కడెక్కడి నుంచో సామాన్య భక్తులు వ్యయప్రయాసలకు ఓర్చి ఏడు కొండలెక్కి వసతులున్నా లేకున్నా రోడ్లపై పడిగాపులు కాస్తారు. కంపార్ట్‌మెంట్లలో గంటలకు గంటలు ఎదురు చూస్తారు. కిక్కిరిసిన క్యూలైన్లలో తోసుకుంటూ.. ఆనందనిలయం ముందు దివ్యదర్శనానికి అడుగుపెడతారు. అరసెకనులో గర్భగుడి బయట క్యూలైన్లలో ఉన్న సామాన్య భక్తులను సిబ్బంది లాగి అవతల పడేస్తుంటే.. అరసెకను ఆ వేంకటేశ్వరుడి దివ్య దర్శనం చేసుకుని అరమోడ్పు కన్నులతో ఆలయం బయటకు చేరతారు. ఇది తిరుమల క్షేత్ర దర్శనం అనగానే మనకు గుర్తుకొచ్చేవి.తిరుపతిలో అడుగు పెట్టింది మొదలు.. మళ్లీ తిరుమలలో దర్శనం ముగించుకుని కొండ దిగే వరకు సామాన్య భక్తులకు ఎన్నో అవస్థలు.. ప్రభుత్వాలు మారుతున్నా.. పాలక మండళ్లు మారుతున్నా నిత్యం భక్తుడికి ఆ వెంకన్న దర్శనం అంటే కేవలం దైవదర్శనం మాత్రమే కాదు. సమస్యలను ముందు దర్శించి వాటిని అధిగమించి ఆ తర్వాతగానీ శ్రీనివాసుడిని దర్శించుకోవడం సాధ్యం కాదు.భార్యాభర్తలు, పిల్లపాపలు, వృద్ధులు ఇలా కుటుంబాలతో కలిసి శ్రీవారిని దర్శించుకునేందుకు తిరుమలకు వస్తుంటారు సామాన్య భక్తులు. కొండపైకి రాగానే వాళ్లకు ముందు వసతి పెద్ద సమస్యగా మారుతుంటుంది. కాటేజీలున్నా.. భక్తుల రద్దీకి తగినంత ఉండవు. రోజురోజుకీ తిరుమలకు వచ్చే భక్తులు పెరుగుతూనే ఉన్నారు. కానీ.. కొండపై ఆ రద్దీని తట్టుకుని భక్తులకు సౌకర్యాలు కల్పించడం పెను సవాలే. వీఐపీ భక్తులకు ప్రత్యేకమైన కాటేజ్‌లు, వసతులున్నాయి. బ్రేక్ , స్పెషల్ పేరుతో రెండు మూడు గంటల్లోనే వెంకన్న దర్శనం పూర్తవుతుంది. సామాన్య భక్తులకు వసతి సముదాయాలు అంతంత మాత్రమే. కొండపై వీఐపీలకే ప్రాధాన్యమిస్తున్నారని వారి సేవలోనే టీటీడీ తరిస్తోందన్న ఆరోపణలు పెరిగాయి. వచ్చే భక్తుల సంఖ్య పెరుగుతున్నా టీటీడీ మాత్రం ఉన్న కాటేజీలతోనే సర్దుబాటు చేస్తోందని.. సామాన్య భక్తులకు కొత్త కాటేజీలు, వసతి సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు.వారాంతాలు, పర్వదినాలు, సెలవులు, బ్రహ్మోత్సవాలు.. ఇలాంటి సమయాల్లో తిరుమలకు రద్దీ విపరీతంగా పెరుగుతూ ఉంటుంది. అప్పుడు భక్తులు పడే అవస్థలు అన్నీఇన్నీ కావు. ఓవైపు తమ ఇలవేల్పు, నమ్మిన దైవమైన వేంకటేశ్వరుడిని దర్శించుకోవాలి. అంతకు ముందు కొండపై క్యూలైన్లలో సమస్యలతో సావాసం చేసి ముందుకు సాగాలి. రద్దీ సమయాల్లో వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లన్నీ నిండిపోతాయి. వెలుపలకు కిలోమీటర్ల క్యూలైన్లు కనిపిస్తాయి. చిన్నపిల్లలతో వచ్చినవాళ్లు, వృద్ధులు ఆ క్యూలైన్లు, కంపార్టమెంట్లలో ముందుకు నడవడమంటే కత్తిమీద సామే. అలాంటి వారికి ప్రత్యేక వసతులు కల్పించి వీలైనంత త్వరగా దర్శనం పూర్తి చేయించాల్సిన అవసరముందనేది భక్తుల నుంచి వస్తున్న విన్నపం.కంపార్ట్‌మెంట్లలో దర్శనం కోసం గంటల తరబడి వేచి చూడాలి. అక్కడ పలు ప్రాంతాలకు చెందిన భక్తులుంటారు. పెరుగన్నం, పులిహోర, సాంబార్ రైస్ ఇలా ప్రసాదాలను కంపార్టమెంట్లలో భక్తుల ఆకలి తీర్చేందుకు టీటీడీ అందిస్తుంటుంది. వీటి నాణ్యత విషయంలో భక్తుల నుంచి రకరకాల కంప్లైంట్స్ అందుతున్నాయి. నిత్య అన్నదాన సత్రంలో అన్నప్రసాదం క్వాలిటీపైనా రకరకాల విమర్శలున్నాయి. దర్శనానంతరం శ్రీవారి దివ్యప్రసాదంగా లడ్డూను భక్తులకు అందిస్తారు. వీటి తయారీ, నాణ్యత, లడ్డూ సైజ్‌పై కూడా ఫిర్యాదులు ఈమధ్యకాలంలో పెరిగాయి. ఒకప్పుడు లడ్డూ వారం రోజులు నిల్వ ఉన్నా ఎలాంటి దుర్వాసన వచ్చేది కాదు. కానీ.. అందులో వాడే సరుకుల క్వాలిటీలోపం కారణంగా రెండ్రోజులకే లడ్డూ ప్రసాదం చెడుపోతోందన్న కంప్లైంట్స్ వ్యక్తమవుతున్నాయి. వీటిపైనా ప్రత్యేకమైన దృష్టి పెట్టాలనేది భక్తుల ఆవేదన.ప్రక్షాళన తిరుమల నుంచే మొదలు పెడతామని ఏపీ సీఎం చంద్రబాబు శ్రీవారి దర్శనార్థం కొండకు వచ్చిన సందర్భంగా స్పష్టం చేశారు. భక్తులు ఎదుర్కొనే సమస్యలు ఒకవైపు ఉంటే.. గత పాలకమండలిపై విమర్శలు, అవినీతి ఆరోపణలు తీవ్రమయ్యాయి. ముందుగా టీటీడీ పాలకమండలి ఈవోను మార్చి కొత్త ఈవోగా శ్యామలరావుకు బాధ్యతలు అప్పగించింది ప్రభుత్వం. బాధ్యతలు చేపట్టిన రోజు నుంచే దిద్దుబాటు చర్యలు ప్రారంభించారు. ఏయే వ్యవస్థల్లో లోపాలున్నాయో గుర్తించి సరిచేసేందుకు స్టేట్‌లెవల్ విజిలెన్స్ కమిటీ రంగంలోకి దిగింది.

## 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.250 కోట్లు విడుదల

* సియం ఎన్నికల వాగ్దానంలో భాగంగా నిధులు విడుదల
* రాష్ట్ర ఆర్థికమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన పయ్యావుల కేశవ్

**అమరావతి,జూలై 11 (పీపుల్స్ మోటివేషన్) :**
రాష్ట్రంలోని వివిధ స్థానిక సంస్థలకు మొదటి విడతగా 15 వ ఆర్థిక సంఘం నిధులు రూ.250 కోట్లను విడుదల చేస్తూ రాష్ట్ర ఆర్థిక,ప్రణాళిక,వాణిజ్య,శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ తన మొదటి సంతకం చేశారు.ఈమేరకు గురువారం రాష్ట్ర సచివాలయం రెండవ భవనంలో వేద పండితుల ఆశీర్వచనాల మధ్య పూజా కార్యక్రమాల అనంతరం మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు.ఈసందర్భంగా మంత్రి పయ్యావుల కేశవ్ స్థానిక సంస్థలకు మొదటి విడతగా 15 ఆర్థిక సంఘం నిధులు రూ.250 కోట్లను విడుదల చేస్తూ దస్త్రంపై తొలి సంతకం చేశారు.రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వివిధ గ్రామ పంచాయితీలకు మొదటి విడతగా 15వ ఆర్థిక సంఘం నిధులను విడుదల చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్,కార్యదర్శులు డా.కెవివి. సత్యనారాయణ,జానకి, వినయ్ చంద్,చీఫ్ కమీషనర్ స్టేట్ ట్యాక్సెస్ గిరిజా శంకర్ ఆర్థిక శాఖ స్పెషల్ సెక్రటరి కె.ఆదినారాయణ,డైరెక్టర్ ట్రెజరీస్ మోహన్ రావు,ఎపి జిఎల్ఐ డైరెక్టర్ శ్రీనివాస్ తదితరులు మంత్రి వర్యులకు పుష్ప గుచ్చాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.ఇంకా ఈకార్యక్రమంలో పలువురు సంబంధిత శాఖల అధికారులు,ఇతర ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తరాంధ్రలో చంద్రబాబు పర్యటన

**విశాఖపట్నం, జూలై 11 (పీపుల్స్ మోటివేషన్) :**



ఉత్తరాంధ్ర ప్రజలు భారీ ఎన్డీయే కూటమిని మెజారిటీతో గెలిపించార న్నారు సీఎం చంద్రబాబు. రాజకీయాల్లో విర్రవీగిన వారికి ప్రజలు తగిన శిక్ష వేశారని చురకలు అం టించారు. రాష్ట్రం నిలదొక్కుకోవడానికి తమ బాధ్యత తాము నిర్వ హిస్తామని అన్నారు. ఆంధ్రప్రదేశ్ లో కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత తొలిసారి ఉత్తరాంధ్రలో పర్యటించారు సీఎం చంద్రబాబు. పోలవరం ఎడమకాలువ పనులను పరిశీలించడంతో పాటూ భోగాపురం ఎయిర్ పోర్టు పనులపై ఆధికారుల ను అడిగి తెలుసుకోనున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కొన్ని కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వమే కాకుండా ప్రజలు కూడా అభివృద్ధికి సహకరించాలని కోరారు. విశాఖ స్టీల్స్ ప్రైవేటీకరణ ను తాను ఒప్పుకున్నామని చెబుతు న్నారు.. అవన్నీ అబద్దాలని అన్నా రు సీఎం చంద్రబాబు. గతంలో వాజపేయి హయాంలోనే ప్రైవేటీక రణ చేస్తాన్నప్పుడు అడ్డుకున్నామని స్పష్టం చేశారు. ఈ సారి విశాఖ ప్రైవేటీకరణ జరగకుండా కాపడుతామన్నారు.

## కౌలు కార్డు కొరకు దరఖాస్తు చేసుకోండి : ఏవో పవన్ కుమార్

**తుగ్గలి, జూలై 11 (పీపుల్స్ మోటివేషన్) :**
మండల పరిధిలోని గల కౌలు రైతులందరూ కౌలు కార్డు కొరకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్ తెలియజేశారు. గురువారం రోజున మండల కేంద్రంలో గల తహసిల్దార్ కార్యాలయం నందు తహసిల్దార్ షర్మిల అధ్యక్షతన కౌలు రైతు కార్డ్ పై గ్రామ రెవెన్యూ అధికారులకు సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో కౌలు చేస్తున్న ప్రతి రైతు కౌలు కార్డు ను గ్రామ రెవెన్యూ అధికారి దగ్గర తీసుకోవాలని ఏవో తెలియజేశారు. కౌలు కార్డు ఉన్న కౌలు రైతుకు అన్ని రకాల ప్రభుత్వ పథకాలైన అన్నదాత సుఖీభవ,పంట బీమా,పెట్టుబడి సహాయం,పంట కొనుగోలు,బ్యాంకు రుణము వంటి ప్రభుత్వ పథకాలు అందుతాయని ఏవో తెలియజేశారు. గురువారం నుండి ప్రతి సచివాలయం నందు కౌలు రైతు కార్డు అవగాహన సదస్సులు జరుగుతాయని ఏవో వీఆర్వోలకు తెలియజేశారు.ఈ అవకాశాన్ని కౌలు రైతులందరూ వినియోగించుకోవాలని ఏఓ తెలియజేశారు.ఈ కార్యక్రమంలో తుగ్గలి డిప్యూటీ తహసిల్దార్ నాగరాజు,ఆర్ఐ సుధాకర్ రెడ్డి,మండల విఆర్వోలు, వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చి దిద్దేలా ఇందిరా మహిళాశక్తి కార్యక్రమం

**జిల్లా కలెక్టర్ పమేల సత్పతి**



**కరీంనగర్, జూలై 11 (పీపుల్స్ మోటివేషన్) :**
ప్రారంభించే వ్యాపారంపై సమగ్ర అవగాహనను కలిగి ఉండాలి. వ్యాపారం ఎక్కువకాలం కొనసాగేలా సమిష్టిగా సహకారంతో సాగాలి. స్కూల్ యూనిఫాం స్టిచ్చింగ్ లో జిల్లాలో మహిళా సంఘాలు సక్సెస్ సాధించాయి. మహిళాశక్తి కార్యక్రమంలో కొరకు వివిధ పథకాలను గురించి అధికారుల అవగాహన గ్రామీణ మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగటానికి ఇందిరా మహిళా శక్తి ఉపయోగపడుతుందని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. గురువారం కలెక్టరేట్ ఆడిటోరియం లో ఇందిరా మహిళా శక్తి పై డి ఆర్ డి ఏ, మెప్మా, వ్యవసాయ శాఖ, పశుసంవర్ధక శాఖ, ఇండస్ట్రీ అధికారులతో నిర్వహించిన సమన్వయ కమిటీ సమావేశానికి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ, మహిళలను అద్భుత పారిశ్రామిక వేత్తలుగా తీర్చిద్దాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి కార్యక్రమానికి రూపకల్పన చేసిందని అన్నారు. ఈ కార్యక్రమం ద్వారా మహిళలు వ్యాపారాన్ని ప్రారంభించే ముందు. మీ ద్వారా ఉత్పత్తి అయ్యే వస్తువుకు సంబంధించిన మార్కెటింగ్ మరియు వ్యాపారం గురించిన సంపూర్ణ అవగాహనను పెంపొందించుకొవాలని అన్నారు. కరీంనగర్ జిల్లాలో మొట్ట మొదటగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల కొరకు మెప్మా , డిఆర్డిఓ, మహిళల సంఘాలు స్టిచ్చింగ్ చేసి అందించడంతో కార్యక్రమం విజయవంతం అయిందని పేర్కొన్నారు. అదే విధంగా అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమం ద్వారా సివిల్ పనులను మహిళా సంఘాల ద్వారా చేపట్టగా 85శాతం పనులు పూర్తయ్యాయని తెలిపారు. మిగిలిన 15శాతం పనులు త్వరగా పూర్తిచేసి జిల్లాకు మంచిపేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు. ప్రతి మహిళా ఎదోఒక మైక్రో ఎంటర్ ప్రైజెస్ ను సద్వినియోగం చేసుకుంటున్నారని, 7800 మైక్రో ఎంటర్ ప్రైజెస్ యూనిట్ ల ద్వారా సహాకారం అందిస్తూ. పియంఈజివైయం ద్వారా సబ్సిడి కూడా ఇప్పించడం జరుగుతుందని పేర్కోన్నారు. మహిళా సంఘాలన్ని ఒకే చోట ఒకే విధమైన వ్యాపారాలను నిర్వహించడం వంటివి కాకుండా అక్కడి మార్కెట్ పరిస్థితులకు అనుగునంగా వ్యాపారాలను ప్రారంభించుకోవాలని అన్నారు. వ్యాపారాన్ని సమిష్టిగా నిర్వహించడం మాత్రమే కాదు, వ్యాపార వృద్ధి కూడా సంపూర్ణ సహాయ సహకారాలతో ఎలాంటి అపోహలకు తావు లేకుండా జరగాలని అప్పుడే అద్భుతమైన విజయాలను చవిచూడగలమన్నారు. కొన్ని చోట్ల స్వయం సహాయ సంఘాల ద్వారా జరిగే వ్యాపారాలు అనుకున్న విజయాలను సాధించినప్పటికి కొంత కాలం నడిపించామా, ఆ తరువాత వ్యాపారం పూర్తిగా మూసివేశామ అన్న చందంగా ఉండకుండదని, పటిష్టమైన క్యాలిటిని డిమాండుకు తగ్గ సప్లైని అందిస్తూ వినియోగదారుల ప్రాధాన్యతను చూరగొని వ్యాపారాలను వృద్ధి చేసుకొవాలని తెలిపారు. అదే విధంగా వ్యాపారం కొరకు తీసుకునే ఋణాలను కూడా సకాలంలో చెల్లించాలని అన్నారు. మహిళా సంఘాలకు ఏమేమి పథకాలు ఉన్నాయో వివరించారు. మహిళా సంఘాలు వ్యక్తిగతంగా కాకుండా సమిష్టిగా ఆలోచించి మంచి నిర్ణయం తీసుకోవాలని అన్నారు. డిమాండ్ ప్రాతిపదికన యూనిట్లు ఏర్పాటు చేస్తే అవి ప్రయోజనకరంగా ఉంటాయని తెలిపారు. అదనపు కలెక్టర్ 1ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ, కోటి మంది మహిళలను కొటీశ్వరులను చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు. ముందుగా వ్యాపారాన్ని ఎక్కడ ప్రారంబించాలనుకున్న, దానికన్న ముందే మన సామర్థ్యం, వీక్ నెస్, సహాకారం, నిజాయితి ఈ విషయాలను గురించి సంపూర్ణ, స్పష్టమైన అవగాహనను కలిగి ఉన్నట్లయితే వ్యాపారాన్ని సునాయాసంగా లాభసాటిగా మార్చుకొగలమని తెలిపారు. అదే విధంగా వ్యాపారాన్ని విజయవంతంగా కొనసాగించే వారిని ఆదర్శంగా తీసుకొని మహిళా సంఘాలన్ని సమన్వయంతో ముందుకు సాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పిడి డిఆర్డిఓ శ్రీనివాస్, ఎల్డియం ఆంజనేయులు, జియం ఇండస్ట్రీస్ నవీన్ కుమార్, పశు సంవర్దక శాఖ అధికారి తదితరులు పాల్గోన్నారు.

## దర్శిని హత్యా కేసు నిందితుడు సురేష్ ఆత్మహత్య

**అనకాపల్లి, జూలై 11 (పీపుల్స్ మోటివేషన్) :**
అనకాపల్లి జిల్లా: రాంబిల్లి మండలం కొప్పుగుండుపాలెంలో తొమ్మిదో తరగతి విద్యార్థిని బద్ది దర్శినిని దారుణంగా హత్య చేసిన కేసు లో నిందితుడు సురేష్ ఆత్మహత్య చేసుకున్నాడు. రాంబిల్లి మండలం కొప్పుగుండుపాలెం శివారులో సురేష్ మృతదేహం గుర్తించార. ఈనెల ఆరవ తేదీన శనివారం 9వ తరగతి విద్యార్థిని దర్శినిని గొంతు కోసి చంపిన ప్రేమోన్మాది సురేష్, పాఠశాల నుంచి ఇంటికి వచ్చి స్నానం చేసి గదిలోకి వెళ్లిన దర్శినిని కత్తితో నరికి చంపాడు. అప్పటినుంచి నిందితుడి కోసం 14 పోలీసు బృందాలు రాష్ట్రవ్యాప్తంగా గాలింపు చర్యలు చేపట్టాయి.. ఇతని ఆచూకీ చెప్పిన వారికి 50 వేల రూపాయల నగదు బహుమతిని పోలీసు వారు ప్రకటించారు. ఈ నేపథ్యంలో బుధవారంసురేష్ మృతదేహం గ్రామ శివారులో కనిపించింది.. ఇతని మృతదేహం బాగా కుళ్ళిపోవడంతో ఇతను ఆత్మహత్య ఎలా చేసుకున్నది తెలియరాలేదు.. అయితే ఒంటి మీద ఎటువంటి గాయాలు లేవని పోలీసులు చెబుతున్నారు.. మృదేహాన్ని స్వాధీనం చేసుకొని శివ పరీక్ష కోసం అనకాపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించే ఏర్పాట్లు చేస్తున్నారు.. విద్యార్థిని దర్శిని హత్య రాష్ట్రవ్యాప్తంగా సంచలనం కలిగించింది.. దీన్ని ప్రభుత్వం కూడా సీరియస్గా తీసుకొని ప్రతిష్టాత్మకంగా దర్యాప్తు చేపట్టాలని పోలీస్ శాఖను ఆదేశించింది. ఈ కేసులో నిందితుడు తక్షణం పట్టుకోవాలని హోం శాఖ మంత్రి అనిత పోలీసులను ఆదేశించిన విషయం తెలిసిందే.

## వేతనాల కోసం నిరసనకు దిగిన కార్మికులు

**నిజామాబాద్, జూలై 11 (పీపుల్స్ మోటివేషన్) :**
నిజామాబాద్ జిల్లా నందిపేట్ మండలంలో అర్గుల్ రాజారాం గుత్ప ఎత్తిపోతల పథకం ద్వారా ఆర్మూర్ డివిజన్ పరిధిలో ఎన్నో వేల ఎకరాల పంటలకు సాగునీరు అందిస్తుంది. ఎత్తిపోతల పథకం నందు పనిచేసే కార్మికులకు మాత్రం కాంట్రాక్టర్లు ఐదు నెలల నుండి వేతనాలు చెల్లించక ఇబ్బందులకు గురి చేస్తున్నారని కార్మికులు ఎత్తిపోతల పథకం ముందర నిరసన వ్యక్తం చేశారు. ఇందులో పని చేసే 19 మంది రవి ఎంటర్ప్రైజెస్ కింద 2008 కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ అయ్యారు. రవి ఎంటర్ప్రైజెస్ కిషోర్ రెడ్డికి బాధ్యతలను అప్పగించగా కిషోర్ రెడ్డి తమిళనాడుకు చెందిన కన్నన్ కాంట్రాక్షన్ కంపెనీ కి కాంట్రాక్టును అప్పగించడంతో కన్నన్ ఏజెన్సీ వాళ్ళు ఐదు నెలల నుంచి డబ్బులు ఇవ్వకపోవడమే కాకుండా డబ్బులు అడిగితే దూషణలు చేస్తున్నారని భయ భ్రాంతులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం జోక్యం చేసుకొని జీతాలను ఇప్పించి తమను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు.

## ప్రభుత్వం పాఠశాలలో లైంగిక దాడులకు దిగుతున్న ఉపాధ్యాయులు

**హైదరాబాద్, జూలై 11 (పీపుల్స్ మోటివేషన్) :**



బాగ్ అంబర్పేట ప్రభుత్వ పాఠశాలలో ఫిజిక్స్ ఉపాధ్యాయుడు సురేష్ విద్యార్థినులపై లైంగికంగా వేధింపులకు పాల్పడిన ఘటన బయటపడింది. ఆరవ తరగతి చదువుతున్న విద్యార్థినులపై లైంగిక దాడి జరిపినట్లు ఆరోపణ. బాధితులు అంబర్ పేట పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసారు. అంబర్ పేట పోలీసులు సురేష్ ను అరెస్ట్ చేసారు. గత ఒక నెల నుండి ఈ స్కూల్లో విద్యాభ్యాసం నేర్పిస్తున్నాడు. స్కూల్ కి చేరుకున్న విద్యార్థి సంఘాలు నాయకులు నిరసనకు దిగారు.

# మళ్లీ రాజకీయాల్లోకి మాజీ ఎంపీ మురళీమోహన్


**రాజమండ్రి, జూలై 11(పీపుల్స్ మోటివేషన్) :**



టాలీవుడ్ సీనియర్ నటుడు, రాజమండ్రి మాజీ ఎంపీ మురళీమోహన్ మళ్లీ రాజకీయాల్లోకి రానున్నారా? మరోవైపు చంద్రబాబు నేతృత్వంలో ఏపీలో కూటమి ప్రభుత్వం ఏర్పడటంతో మురళీమోహన్ రాజకీయాలు చేసే ఛాన్స్ ఉందని ప్రచారం జరుగుతోంది. తన పొలిటికల్ రీఎంట్రీపై రాజమండ్రి మాజీ ఎంపీ మురళీమోహన్ స్పందించారు. ఏపీ సీఎం చంద్రబాబు తనను ఆహ్వానించిన మాట నిజమనేనని, అయితే మళ్లీ రాజకీయాల్లోకి వచ్చే ఆలోచన లేదన్నారు. రాజమండ్రికి వచ్చిన సందర్భంగా మురళీమోహన్ మాట్లాడుతూ.. రాజమండ్రి పార్లమెంటు నియోజకవర్గంలోని ఏడుగురు ఎమ్మెల్యేలను, రాజమండ్రి ఎంపీగా గెలుపొందిన దగ్గుబాటి పురంధేశ్వరిని అభినందించాలని వచ్చినట్లు తెలిపారు. తన హయాంలో ప్రారంభించిన ఫ్లైఓవర్, ఈఎస్ఐ ఆసుపత్రుల నిర్మాణాలను పరిశీలించినట్లు తెలిపారు. తన సొంత డబ్బులు ఖర్చు పెట్టుకుని రాజకీయాలు చేశానని, డబ్బులు ఎలా సంపాదించాలో తనకు తెలుసునని, అక్రమాలు చేయాల్సిన అవసరం లేదన్నారు. వైసీపీ నేత, మాజీ ఎంపీ మార్గాని భరత్ తన మీద చేసిన ఆరోపణల్ని మురళీమోహన్ ఖండించారు. తాను ఇసుక అమ్ముకున్నానంటూ మాజీ ఎంపీ భరత్ తనపై నిరాధార ఆరోపణలు చేశారంటూ మండిపడ్డారు. రాజమండ్రి ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు రాజకీయాల్లో రాణిస్తున్నారని, ఆయనకు తన మద్దతు ఉంటుందన్నారు. మోరంపూడి ఫ్లైఓవర్ ఫ్లైఓవర్ ఎవరు శంకుస్థాపన చేశారో మాజీ ఎంపీ మార్గాని భరత్ గుండె మీద చేయి వేసుకొని చెప్పాలన్నారు. ఈ ఈ విషయాన్ని ఆయన విజ్ఞతకే వదిలేస్తా అన్నారు. మార్గాని భరత్ ఇటీవల మీడియాతో మాట్లాడుతూ.. తన ప్రెస్ మీట్ ను లక్షల మంది చూస్తారని, ఆదిరెడ్డి వాసు మాట్లాడితే వేలల్లోనే చూస్తారంటూ చేసిన వ్యాఖ్యలపై ట్రోల్ చేశారు.మోరంపూడి ఫ్లైఓవర్ నిర్మాణానికి మాజీ ఎంపీ మురళీమోహన్ చాలా కృషి చేశారని రాజమండ్రి ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాసు అన్నారు. కానీ ఒకే నిర్మాణానికి రెండు శిలాఫలకాలు భారతదేశంలో ఎక్కడా చూడబోమని, ఏపీలో వైసీపీ పాలనతో అది సాధ్యమైందని ఎద్దేవా చేశారు. ఈ ఫ్లైఓవర్ నిర్మాణం కోసం వైసీపీ ఎంపీగా ఉన్న సమయంలో మార్గాని భరత్ ప్రత్యేకంగా చేసింది ఏమీ లేదన్నారు. ఒకవేళ మాజీ ఎంపీ మార్గాని భరత్ నిజంగా రాజమండ్రిని అభివృద్ధి చేసి ఉంటే అసెంబ్లీ ఎన్నికల్లో తనకు 70 వేల మెజారిటీ వచ్చేది కాదన్నారు. పెద్దలను గౌరవించడం నేర్చుకుంటే రాజకీయ ఉనికి ఉంటుందని మార్గాని భరత్‌కు టీడీపీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు హితవు పలికారు. రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురంధేశ్వరి మాట్లాడుతూ.. హైవేలపై మరమ్మత్తులు త్వరలోనే ప్రారంభమవుతాయని తెలిపారు. మాజీ ఎంపీ మురళీమోహన్ సమయంలోనే మోరంపూడి ఫ్లైఓవర్ నిర్మాణాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. మోరంపూడి ఫ్లైఓవర్ నిర్మాణానికి కేంద్రం రూ. 100 కోట్లు నిధులు ఇస్తుందన్నారు. కేంద్రంలోని బీజేపీ హయాంలో రోజుకి 30 కిలోమీటర్ల హైవే రోడ్ల నిర్మాణం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని, బలమైన ఆర్థిక శక్తిగా ఎదగాలంటే మౌలిక సదుపాయాలు కావాలన్నారు.

# పాలనలోనూ.. పవన్ మార్క్

**కాకినాడ, జూలై 11(పీపుల్స్ మోటివేషన్) :**



సినిమాల్లో ట్రెండ్ సెట్ చేసే పవన్ కల్యాణ్.. పాలనా వ్యవహారాల్లోనూ ట్రెండ్ సెట్టర్‌గా నిలుస్తున్నారు. డిప్యూటీ సీఎంగా పిఠాపురం అభివృద్ధిపై దృష్టి పెట్టిన ఆయన.. నియోజకవర్గంలోని సమస్యలపై అధ్యయనం చేయిస్తున్నారు. అయితే.. పిఠాపురం మున్సిపాలిటీ సిబ్బంది పనితీరుపై సర్వే చేయిస్తూ సరికొత్త ట్రెండ్‌కు శ్రీకారం చుట్టారు. పిఠాపురం మున్సిపాలిటీలోని సమస్యలు, మౌలిక వసతులపై సర్వే అధికారులు అధ్యయనం చేస్తున్నారు. ఈక్రమంలో.. పిఠాపురంలో అనేక సమస్యలు గుర్తించి మున్సిపాలిటీ సిబ్బంది పనితీరుపై అసహనం వ్యక్తం చేశారు. ఇక.. పిఠాపురం నియోజవర్గాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేసేలా వేగంగా అడుగులు వేస్తున్నారు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్. పిఠాపురం అభివృద్ధికి సంబంధించి అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. అటు.. పార్టీ నేతలు, కార్యకర్తలతో ప్రత్యేకంగా సమావేశమై.. పిఠాపురం సమస్యలను అడిగి తెలుసుకుంటున్నారు. పిఠాపురంపై వరుసగా సమీక్షలు చేస్తూ అధికారులను ఉరుకులు, పరుగులు పెట్టిస్తున్నారు. ప్రజా సంక్షేమం విషయంలో రాజీ పడకుండా ముందుకు వెళ్తున్నారు. ప్రతి విషయాన్ని ప్రజలకు అర్థమయ్యేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఎప్పటికప్పుడు అధికారులను అప్రమత్తంగా చేస్తున్నారు. జిల్లా హెడ్ క్వార్టర్స్‌లో కలెక్టర్ చేపట్టే ప్రజా సమస్యల పరిష్కార వేదిక లాంటి కార్యక్రమాన్ని కూడా నెలలో రెండు వారాలు పిఠాపురంలోనే ఏర్పాటు చేస్తున్నారు. మరోవైపు.. ప్లాస్టిక్ భూతంపై యుద్ధాన్ని ప్రకటించారు పవన్ కల్యాణ్. తాజాగా.. కాలుష్య నియంత్రణపై రివ్యూ చేసిన పవన్.. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించే విధంగా కార్యాచరణను రూపొందిస్తున్నట్లు ప్రకటించారు. సొంత నియోజకవర్గమైన పిఠాపురం నుంచే కార్యక్రమం ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ప్లాస్టిక్ వస్తువుల వినియోగం తగ్గించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. ఇలాంటి సమయంలోనే పిఠాపురం మున్సిపాలిటీ సిబ్బంది పనితీరుపై ప్రత్యేక అధికారుల బృందంతో పవన్‌కళ్యాణ్ సర్వే చేయిస్తుండడం హాట్‌టాపిక్‌గా మారింది.

# వాటర్ లాగింగ్ ప్రాంతాల్లో సంపుల నిర్మాణం

**హైదరాబాద్, జూలై 11(పీపుల్స్ మోటివేషన్) :**



వర్షాకాలంలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా కార్యచరణ చేపట్టింది తెలంగాణ సర్కార్. వాటర్ లాగింగ్ పాయింట్స్‌పై యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తోంది. గ్రేటర్ హైదరాబాద్‌లో వర్షపు నీళ్లు రోడ్లపై నిలకుండా సంపులు కడతామంటోంది తెలంగాణ సర్కారు. అందుకు సంబంధించి యాక్షన్ స్టార్ట్ చేసింది. ఈ మేరకు ఖైరతాబాద్ జంక్షన్, రాజ్ భవన్ రోడ్డులోని లేక్ వ్యూ గెస్ట్ హౌస్, సోమాజిగూడ ఆర్టీఏ ఆఫీస్ ప్రాంతాల్లో 10 లక్షల లీటర్ల సామర్థ్యం గల సంపులను నిర్మించనున్నట్లు మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిషోర్ వెల్లడించారు. వర్షాకాలం వచ్చేసింది. చినుకు పడితే హైదరాబాద్ నగర వాసుల్లో వణుకు పుడుతుంది. ఎక్కడ మ్యాన్ హోల్స్ ఉన్నాయో తెలియని పరిస్థితి. కొన్ని ప్రాంతాల్లో అయితే వర్షపు నీటిప్రవాహానికి గల్లీలన్నీ నీట మునిగిపోతాయి. వరద ఉధృతి తీవ్రంగా ఉంటుంది. వాటిని అధిగమించడం కోసం సరికొత్త ప్రణాళికలు రూపొందించారు బల్దియా అధికారులు.సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు జీహెచ్ఎంసీ, ఆర్ అండ్ బీ ఉన్నతాధికారులతో కలిసి ఆయా ప్రాంతాల్లో పర్యటించారు దానకిశోర్. వర్షకాలంలో నీళ్లు నిలిచి ఉండే 140 ప్రాంతాల్లో.. సంపులు నిర్మించడానికి తగిన స్థలాన్ని గుర్తించాలని జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్‌ను ఆయన ఆదేశించారు. మొదటగా ఖైరతాబాద్ జోన్, జూబ్లీహిల్ సర్కిళ్లలో సంపులు నిర్మిస్తామన్నారు దానకిశోర్. మొత్తం 11 ప్రాంతాల్లో 20 కోట్ల రూపాయలతో 10 లక్షల లీటర్ల సామర్థ్యంతో సంపులు నిర్మిస్తామని వెల్లడించారు. వర్షం కురిసే సమయంలో ఈ సంపుల్లో నీటిని సేకరించి.. సమీపంలో ఉన్న నాలాల్లో పంపింగ్ చేసేలా ఏర్పాట్లు చేస్తామన్నారు. ఈ మేరకు జీహెచ్ఎంసీ కమిషనర్, జోనల్ కమిషనర్లు, ఎస్ఈలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహిస్తామన్నారు మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిశోర్. మొత్తంగా.. సీఎం ఆదేశాలతో వాటర్ లాగింగ్ ప్రాంతాలపై ఫుల్ ఫోకస్ పెట్టారు మున్సిపల్ శాఖ అధికారులు. త్వరతగతిన సంపులు నిర్మించేందుకు స్థల సేకరణలో బిజీ అయ్యారు.

# ప్రవీణ్ ప్రకాష్ స్వచ్ఛంద పదవీ విరమణకు గ్రీన్ సిగ్నల్

**విజయవాడ, జూలై 11(పీపుల్స్ మోటివేషన్) :**



ఆంధ్రప్రదేశ్ సీనియర్ ఐఏఎస్ అధికారి ప్రవీణ్ ప్రకాష్ చేసుకున్న వాలంటరీ రిటైర్మెంట్ దరఖాస్తును రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. 1994 బ్యాచ్‌కు చెందిన ప్రవీణ్ ప్రకాష్ మరో ఏడేళ్ల సర్వీస్ ఉండగానే పదవీ విరమణ చేయనున్నారు.2031 జూన్ 30వ తేదీన రిటైర్ కావాల్సి ఉన్నా ఏపీలో కొత్త ప్రభుత్వం ఏర్పాటు కావడంతో ప్రవీణ్ ప్రకాష్ విఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ఆయన దరఖాస్తును పక్షం రోజుల వ్యవధిలోనే రాష్ట్ర ప్రభుత్వం అమోదించింది. ఈ ఏడాది జూన్ 25వ తేదీన వీఆర్ఎస్ కోసం ప్రవీణ్ ప్రకాష్ దరఖాస్తు కోగా దానిని అమోదిస్తూ మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.ఏడాదిన్నర కిందటే వీఆర్ఎస్ తీసుకోవాలని భావించిన ప్రవీణ్ ప్రకాష్, సన్నిహితుల సూచన మేరకు అప్పట్లో వీఆర్ఎస్ పై వెనక్కు తగ్గారు. అప్పట్లో ముఖ్యమంత్రి కార్యాలయంలో పెత్తనం చెలాయిస్తున్నారని ఐఏఎస్ అధికారుల నుంచి విమర్శలు రావడంతో ఆయనను విద్యాశాఖకు బదిలీ చేశారు. ఆ సమయంలో పదవీ విరమణ చేసి క్రియాశీల రాజకీయాల్లోకి ప్రవేశించాలని భావించారుఅదే సమయంలో ఐదారు సార్లు కేంద్ర సర్వీసులకు వెళ్లేందుకు విఫలయత్నం చేశారు. ఆయన దరఖాస్తు చేసిన ప్రతిసారి కేంద్రం దానిని తిరస్కరించింది. ఆలిండియా సర్వీస్ రూల్స్‌కు విరుద్ధంగా సీనియర్ ఐఏఎస్ అధికారులతో వ్యవహరించారని విమర్శలు ఎదుర్కొన్నారు. ఆయన చర్యలతో ఇబ్బందులకు గురైన అధికారులు డిఓపిటి, కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదులు చేయడంతో ప్రవీణ్ ప్రకాష్‌ను కేంద్ర సర్వీసుల్లోకి తీసుకోడానికి నిరాకరించినట్టు ప్రచారం జరిగింది.ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత ప్రవీణ్ ప్రకాష్ తనకు రాజకీయంగా ఇబ్బందులు తప్పవని భావించారు. కొత్త ప్రభుత్వం కొలువుదీరిన కొద్ది రోజుల్లోనే ఆయన విఆర్ఎస్‌కు దరఖాస్తు చేసకున్నారు. ప్రవీణ్ ప్రకాష్ వీఆర్ఎస్ సెప్టెంబరు 30 నుంచి అమల్లోకి వస్తుందని నోటిఫికేషన్లో పేర్కొన్నారు.ఏపీలో టీడీపీ ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే ప్రవీణ్ ప్రకాష్‌ను విద్యాశాఖ బాధ్యతల నుంచి తప్పించారు. జీఏడీలో రిపోర్టు చేయాలని సూచించింది. మరోవైపు వీఆర్ఎస్ దరఖాస్తు చేయడంలో కూడా ప్రవీణ్ ప్రకాష్ గందరగోళం సృష్టించారు. వీఆర్ఎస్ కోసం చేసిన దరఖాస్తులో చేతిరాతతో సంతకం చేయకుండా డిజిటల్ సంతకం చేశారు. అది చెల్లదని దరఖాస్తును తిప్పి పంపడంతో మరోసారి దరఖాస్తు సమర్పించారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు విఆర్ఎస్ అస్త్రం ప్రయోగించారని సచివాలయంలో ప్రచారం జరిగింది.ఏపీలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే తాను పని చేయలేనంటూ ఎన్నికల ముందు నుంచి ప్రవీణ్ ప్రకాష్ చెబుతూ వచ్చారు. తనకు మంచి ప్రైవేట్ ఉద్యోగం చూడాలని అప్పట్లో ఓ ఐఏఎస్‌కు వాట్సాప్ సందేశం కూడా పంపారని సమాచారం.విద్యాశాఖలో ఉండగా గత ఏడాది బడిఈడు పిల్లలు బడి బయట కని పిస్తే ఉద్యోగానికి రాజీనామా చేస్తానంటూ హడావుడి చేశారు. విద్యాశాఖలో వింత నిర్ణయాలతో ఇబ్బంది పెట్టినట్టు ఉపాధ్యాయులు వాపోయేవారు. సమీక్షలు, శిక్షల పేరుతో ఒత్తిడి పెంచేవారని ఉపాధ్యాయ సంఘాలు ఆరోపించాయి. సార్వత్రిక ఎన్నికలకు ముందు ఉత్తరప్రదేశ్ నుంచి ఎంపీగా పోటీకి ప్రయత్నాలు చేస్తున్నారని, ఉద్యోగానికి రాజీ నామా చేస్తారని కూడా ప్రచారం సాగింది.కాగా ఢిల్లీలో తాను పనులు చక్కబెడతానని చెప్పుకుని ఏపీ సీఎంఓలో అంతులేని అధికారాన్ని అనుభవించారని ప్రవీణ్ ప్రకాష్ విమర్శలు ఎదుర్కొన్నారు. ఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి స్థానం నుంచి ప్రవీణ్ ప్రకాష్ ను ఏపీ ప్రభుత్వం గత నెలలో బదిలీ చేసింది. దాంతో ఆయన వీఆర్ఎస్ నిర్ణయం తీసుకున్నారు. ప్రవీణ్ ప్రకాష్ స్థానంలో కోన శశిధర్‌కు ఆ బాధ్యతలు అప్పగించారు. అయితే వైసీపీ హయాంలో తాను అధికార పక్షంతో అంటకాగినట్లు వచ్చిన ఆరోపణలపై ప్రవీణ్ ప్రకాష్ స్పందించారు. తాను ఎవరినీ లక్ష్యంగా చేసుకుని పనిచేయలేదని, పాఠశాల విద్యాశాఖలో తాను కావాలని ఎవర్నీ అవమానించలేదని ఓ వీడియో విడుదల చేయడం తెలిసిందే. తాను ఎవరినైనా టార్గెట్ చేశానని అనిపిస్తే తనను క్షమించాలని చేతులు జోడించి ప్రార్థిస్తున్నానన్నారు. ఉపాధ్యాయులు, సిబ్బందిని తాను తనిఖీల పేరుతో అవమానించాను అనే వదంతుల్లో వాస్తవం లేదన్నారు. విద్యా శాఖలో, విద్యా వ్యవస్థలో మార్పు కోసం, మెరుగైన వ్యవస్థ కోసం మాత్రమే పని చేశానని సీనియర్ ఐఏఎస్ ప్రవీణ్ ప్రకాష్ వెల్లడించారు.వైసీపీ ప్రభుత్వంలో వివాదాస్పద నిర్ణయాలతో అందరికి దూరమైన ప్రవీణ్ ప్రకాష్ విజయవాడ మునిసిపల్ కమిషనర్‌గా పనిచేసిన సమయంలో ఎవరిని ఖాతరు చేయకుండా రోడ్ల విస్తరణ చేపట్టారు. 20ఏళ్ల క్రితం నగరంలోని ప్రధాన రోడ్ల విస్తరణ ప్రవీణ్ ప్రకాష్ కమిషనర్‌గా ఉన్న సమయంలోనే చేపట్టారు. నగర అవసరాలకు అనుగుణంగా రోడ్లు లేకపోవడంతో మాస్టర్ ప్లాన్‌కు అనుగుణంగా రోడ్ల విస్తరణ చేపట్టారు.2002-2003 మధ్య కాలంలో విజయవాడలోని ఎంజి రోడ్డు, కార్ల్ మార్క్స్ రోడ్ల విస్తరణ చేపట్టారు. దీనిపై పెద్ద ఎత్తున వ్యతిరేకత వచ్చినా వెనుకంజ వేయలేదు. నగరంలో పెరిగిన రద్దీని అప్పుడు విస్తరించిన రోడ్లు కొంత మేరకు ఆదుకుంటున్నాయి. పాతబస్తీ వంటి ఇరుకు ప్రాంతాల్లో కూడా రోడ్లను విస్తరించి ఘనత ప్రవీణ్ ప్రకాష్‌కే దక్కింది. బ్రాహ్మణ వీది, పండిట్ జవహర్ లాల్ నెహ్రూ రోడ్డు, కేటీ రోడ్డు, బిఆర్పీ రోడ్లను కూడా ప్రవీణ్ ప్రకాష్ విస్తరించారు. ఆ తర్వాత వచ్చిన అధికారులు ఎవరు విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్‌లో ఆ స్థాయిలో ప్రభావం చూపించలేకపోయారు.

# హాట్ టాపిక్ గా జగన్ రాజీనామా

**కడప, జూలై 11 (పీపుల్స్ మోటివేషన్) :**



మాజీ సీఎం జగన్.. ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి కడప ఎంపీగా పోటీ చేస్తారని విస్తృత ప్రచారం జరుగుతోంది. దీనిపై వైసీపీ నుంచి ఎలాంటి స్పందన లేకపోవటంతో ఆ పార్టీ శ్రేణులు అయోమయంలో ఉన్నాయి. YCP మౌనం అంగీకారమా? లేక ఎప్పట్లాగే ఉదాసీనతా ? అనేది అర్థం కావడం లేదనే చర్చ సాగుతోంది. ఇంతకీ.. జగన్ రిజైన్ చేయటం ఏమిటి? అసలు.. ఆ వార్తలెలా వస్తున్నాయిఏపీలో జగన్ రాజీనామా అంశం హాట్ టాపిక్‌గా మారింది. గత ఎన్నికల్లో కేవలం 11 సీట్లకే పరిమితం అయిన వైసీపీ అధినేత.. అసెంబ్లీలో ప్రతిపక్ష హోదా కోసం స్పీకర్‌కు లేఖ రాశారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో తమ పార్టీకి ప్రతిపక్ష హోదా రాదని నిర్ధారించుకున్న తర్వాత.. ఆయన ఢిల్లీ వేదికగా రాజకీయాలు చేయాలని యోచనలో ఉన్నట్లు వార్తలు గుప్పుమంటున్నాయి. ఈ వార్తలను అటు జగన్ కానీ ఇటు వైసీపీ నేతలు కానీ ఖండించకపోవటం చర్చనీయాంశంగా మారింది. కొందరు వైసీపీ నేతలు మాత్రం ఇదంతా టీడీపీ చేస్తున్న ప్రచారమని చెబుతున్నారు. అంతేకాని జగన్ రాజీనామా చేస్తారన్న వార్తల్ని ఖండించడం లేదు. అంటే జగన్ రాజీనామా చేయడం నిజమా ? అవినాష్ తో ఎంపీగా రాజీనామా చేయించి.. సైడ్ చేస్తారా ? కుటుంబంలో ఉన్న వ్యతిరేకతను పోగొట్టుకునేందుకు ఈ ఎత్తు వేశారా లేక.. అసెంబ్లీలోకి వెళ్లడం ఇష్టం లేక అలా చేయాలని ప్లాన్ చేశారా ?ఇటీవలే జరిగిన YSR జయంతి కార్యక్రమంలో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఈ వ్యవహారాన్ని మరో మలుపు తిప్పాయి. ఒకవేళ కడపలో ఉపఎన్నిక జరిగితే.. APCC అధ్యక్షురాలైన షర్మిలను గెలిపించే బాధ్యతను తాను తీసుకుంటానని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. నియోజకవర్గంలో ప్రతి ఇంటికీ వెళ్లి.. ఓట్లు అడుగుతానని ఆయన సభలో బహిరంగ ప్రకటన చేశారు. దీంతో ఉపఎన్నికకు సంబంధించిన వార్తలకు మరింత బలం చేకూరినట్లు అయింది. పోగొట్టుకున్న చోటే వెతకాలన్న సామెత ప్రకారం ఏపీ కాంగ్రెస్ పావులు కదుపుతోందని వాదనలు వినిపిస్తున్నాయి. పార్టీ బలోపేతం కోసం ఎలాంటి సహాయమైనా చేయడానికి తాము సిద్ధమంటూ TPCC చీఫ్, సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటనతో ఒక్కసారిగా వాతావరణం వేడెక్కింది. కడప ఎంపీ ఉపఎన్నిక ఖాయమైతే.. షర్మిల, జగన్ ల మధ్య హోరాహోరీ పోటీ ఖాయం. రేవంత్ రెడ్డి బరిలోకి దిగి షర్మిలకు సపోర్ట్ చేస్తే.. జగన్ ఓడిపోవడం ఖాయమని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.ఇక రాహుల్ గాంధీని ప్రధానిగా చూడాలంటే కాంగ్రెస్ శ్రేణులంతా ఒక్కటై పని చేయాలంటూ తెలంగాణ సీఎం రేవంత్ చేసిన వ్యాఖ్యలు.. హస్తం నేతలను ఆలోచనలో పడేశాయని రాజకీయవర్గాలు చెప్పుకుంటున్నాయి. ఇప్పటికైనా జగన్ రాజీనామాపై వైసీపీ అధిష్టానం మౌనం వీడాలి. లేదంటే వైసీపీ నాయకులు, కార్యకర్తల్లో గందరగ◌ోళానికి కారణమవుతుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యర్థుల మైండ్‌గేమ్‌కు వైసీపీ మౌనం అగ్గికి ఆజ్యం పోసినట్టు అవుతుందని అంటున్నారు. జగన్ రాజీనామా ప్రచారంపై ఇప్పటికైనా వైసీపీ పెద్దలు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని చెబుతున్నారు.

# జెడ్పీ పీఠంపై గొట్టిపాటి గురి

**ఒంగోలు, జూలై 11 (పీపుల్స్ మోటివేషన్) :**

ఉమ్మడి ప్రకాశం జిల్లా రాజకీయాలు మంచి జోరుమీద కనిపిస్తున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో పది నియోజకవర్గాల్లో విజయం సాధించిన టీడీపీ... జిల్లా పరిషత్‌లోనూ జెండా ఎగరేయాలని ప్లాన్ చేస్తోంది. జిల్లాలో 56 మండలాలు ఉంటే.. వైసీపీకి 55 మంది జడ్పీటీసీలు ఉన్నారు. మిగిలిన ఒక్కస్థానంపై కోర్టులో వివాదం కొనసాగుతోంది. అసలు ఒక్క సభ్యుడూ లేని జడ్పీని టీడీపీ కైవసం చేసుకుందామని ప్లాన్ చేయడమే రాజకీయంగా ఇంట్రస్టింగ్‌గా మారింది. ఒక్కరూ లేనిచోట టీడీపీ జెండా ఎలా ఎగురుతుందనేది ఉత్కంఠకు కారణమవుతోంది.ఉమ్మడి ప్రకాశం జిల్లా జడ్పీ చైర్‌పర్సన్‌గా ప్రస్తుతం బూచేపల్లి వెంకాయమ్మ వ్యవహరిస్తున్నారు. ఈమె దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి తల్లి. వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్‌కు సన్నిహితుడైన బూచేపల్లి 2019 ఎన్నికల్లో పోటీ చేయకపోవడంతో 2022లో జరిగిన ఎన్నికల్లో ఆయన తల్లికి జడ్పీ చైర్‌పర్సన్ కట్టబెట్టింది వైసీపీ. జడ్పీలో సంపూర్ణ బలం ఉండటంతో చైర్‌పర్సన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు వెంకాయమ్మ. ఇక అసెంబ్లీ ఎన్నికల వరకూ జడ్పీలో చక్రం తిప్పిన బూచేపల్లికి... రాష్ట్రంలో అధికారం మారడంతో పరిస్థితులు ప్రతికూలంగా మారాయి. అసెంబ్లీ ఎన్నికల్లో దర్శి నుంచి పోటీ చేసిన బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి స్వల్ప ఓట్లతో గెలిచారు. అది కూడా మంత్రి గొట్టిపాటి రవికుమార్ సోదరుడి కుమార్తె డాక్టర్ గొట్టిపాటి లక్ష్మిపై గెలిచారు. జిల్లాలో పది చోట్ల గెలిచిన టీడీపీ, దర్శిలో ఓటమిని జీర్ణించుకోలేకపోతోంది. దీనికి ప్రతీకారంగా జడ్పీలో వైసీపీని గద్దె దించాలని ప్లాన్ చేస్తోంది. దర్శిలో ఓడిన గొట్టిపాటి లక్షి ని జడ్పీ చైర్‌పర్సన్ చేయాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్ వ్యూహం రచిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.అయితే మంత్రి గొట్టిపాటి అనుకున్నట్లు జడ్పీ చైర్‌పర్సన్ పదవి నుంచి బూచేపల్లి వెంకాయమ్మను దింపడం అంత ఈజీ కాదనే విశ్లేషణలు ఉన్నాయి. మంత్రి గొట్టిపాటి తలచుకుంటే అదేమీ పెద్ద పనికాదనే అభిప్రాయం జిల్లాలో వినిపిస్తోంది. 55 మంది సభ్యుల్లో 28 మందిని టీడీపీలో చేర్చుకుంటే జడ్పీ పీఠం టీడీపీ వశమవుతుందని లెక్కలు వేస్తోంది టీడీపీ. ఇందుకోసం ఆపరేషన్ స్టార్ట్ చేసింది. ఎన్నికల ముందు వైసీపీ నుంచి నలుగురు జడ్పీటీసీలు టీడీపీలో చేరగా, మరికొందరు ప్రస్తుతం మంత్రి గొట్టిపాటితో టచ్‌లోకి వెళ్లినట్లు చెబుతున్నారు. ప్రస్తుతం టీడీపీ లక్ష్యాన్ని చేరుకోవాలంటే ఇంకో 24 మంది సభ్యులు అవసరం కాగా, మంత్రితో టచ్‌లో ఉన్నవారు... పార్టీలో చేరేందుకు ఆసక్తి చూపిస్తున్నవారు లిస్టు చాలా ఎక్కువే ఉందంటున్నారు. దీంతో వైసీపీలో అలజడి మొదలైందని చెబుతున్నారు.జడ్పీ పీఠం నుంచి చైర్‌పర్సన్‌ను దించేయాలంటే పంచాయతీరాజ్ చట్టం ప్రకారం నాలుగేళ్లు తర్వాతే అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాల్సి ఉంటుంది. అంటే ఇంకో రెండేళ్లు వేచి చూడాల్సి ఉంటుంది. పంచాయతీలు, గ్రామాల అభివృద్ధిలో జడ్పీ కీలకంగా ఉండటంతో జడ్పీ పీఠం తమ ఆధీనంలో ఉండాలని భావిస్తున్న టీడీపీ అవసరమైతే... పంచాయతీరాజ్ చట్టాన్ని సవరించే విషయాన్ని పరిశీలిస్తోందంటున్నారు.మొత్తానికి ప్రకాశం జడ్పీని కైవసం చేసుకోవడమే టార్గెట్‌గా స్కెచ్ రెడీ చేస్తున్నారు మంత్రి గొట్టిపాటి రవికుమార్. పార్టీపరంగా ఒక్క సభ్యుడు లేని టీడీపీ... ఏకంగా చైర్మన్ గిరీపై గురిపెట్టి అడుగులు వేయడం రాజకీయంగా ఆసక్తి రేపుతుండగా, జడ్పీటీసీలను రక్షించుకోవడంపై టెన్షన్ పడుతోంది వైసీపీ... మొత్తానికి అసెంబ్లీ ఎన్నికల వేడి చల్లారకుండానే.. జడ్పీ రాజకీయం వేడిపుట్టిస్తోంది.

# ఏపీ కాంగ్రెస్ ఫ్యూచర్ లేనట్టేనా



**విజయవాడ, జూలై 11 (పీపుల్స్ మోటివేషన్) :**

ఆంధ్రప్రదేశ్ లో కాంగ్రెస్ పార్టీ గాడిన పడే పరిస్థితి కనిపించడం లేదు. దేశమంతా కాంగ్రెస్ కు అనుకూలత కనిపిస్తున్నప్పటికీ ఆంధ్రప్రదేశ్ లో మాత్రం అస్సలు కొరుకుడు పడటం లేదు. రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు కావస్తుంది. రాష్ట్ర విభజన జరిగిన మూడు ఎన్నికల్లో ఒక్క స్థానంలోనూ గెలవలేకపోయిందంటే ఆ పార్టీ పట్ల ప్రజలు ఎంత వ్యతిరేకత పెంచుకున్నారో ఇట్టే అర్థమవుతుంది. వరసగా మూడుసార్లు అనేక ప్రయోగాలు చేశారు. కానీ ఏ ప్రయోగం విజయవంతం కాలేదు. సరికదా కాంగ్రెస్ ను కలుపుకోవడానికి కూడా ప్రధాన పార్టీలు ఎవరూ ముందుకు రావడం లేదంటే ఆ పార్టీ పరిస్థితి చెప్పకనే తెలుస్తుంది. వైఎస్ షర్మిల రాజశేఖర్ రెడ్డి 75వ జయంతి వేడుకల పేరిట చేస్తున్న హడావిడికి ఎంత మాత్రం స్పందన వస్తుందన్నది చూడాలి. వైఎస్ షర్మిలను నమ్మి నేతలు ఎవరూ వస్తారన్నది ఇప్పటికీ మిలియన్ డాలర్ల ప్రశ్నే. ఆంధ్రప్రదేశ్ లో జాతీయ పార్టీలకు స్థానం లేదు. అయితే కేంద్రంలో అధికారంలో ఉండటంతో బీజేపీకి కొంత సానుకూలత ఉంది. ఇక్కడ ఏ పార్టీ పార్లమెంటు స్థానాలను గెలిచినా అన్నీ బీజేపీ ఖాతాలోనే గత పదేళ్ల నుంచిపడుతూ వస్తున్నాయి. అందుకే బీజేపీకి ప్రత్యేకంగా వచ్చే నష్టమేమీ లేదు. కానీ కాంగ్రెస్ కు అలా కాదు. ఇటు రాష్ట్రంలో బలంగా ఉన్న టీడీపీ కానీ, వైసీపీ కాని కాంగ్రెస్ ను కలుపుకుని పోవడానికి ఇష్టపడటం లేదు. మొన్నటి ఎన్నికల్లో కేవలం బలం లేని కమ్యునిస్టులు విధిలేని పరిస్తితుల్లో జత కట్టారు. రాష్ట్ర విభజన చేసిన పార్టీగా ఇప్పటికీ ప్రజలు కాంగ్రెస్ ను దూరం పెడుతున్నారన్న భయంతో దానిని దగ్గరకు కూడా రానివ్వడం లేదు. నిజానికి ఏపీలో జాతీయ పార్టీలకు స్థానం లేదు. కేవలం ప్రాంతీయ పార్టీలనే ప్రజలు ఆదరిస్తూ వస్తున్నారు. కాంగ్రెస్ నేతలు, క్యాడర్ గంపగుత్తగా వైసీపీ కి వెళ్లిపోయారు. కొద్దో గొప్పో నేతలున్నప్పటికీ వారు బయటకు వచ్చి పార్టీ బలోపేతానికి పనిచేసేవారు కారు.కాంగ్రెస్ మూడు ఎన్నికలకు ముందు అనేక ప్రయోగాలు చేసింది. తొలిసారి పీసీసీ చీఫ్ గా రఘువీరారెడ్డిని నియమించింది. 2014లో అప్పుడే రాష్ట్ర విభజన జరగడంతో ఆగ్రహించిన ప్రజలు ఆ పార్టీని దగ్గరకు కూడా రానివ్వలేదు. ఇక 2019 ఎన్నికలసమయంలో దళిత వర్గానికి చెందిన సాకే శైలజానాథ్ కు పార్టీ పగ్గాలు అప్పగించారు. అయితే అప్పుడు కూడా జనం ఆదరించలేదు. రెండుసార్లు శాసనసభలోకి కాంగ్రెస్ సభ్యులు కాలు మోపలేకపోయారు. జనం ఆగ్రహం ఇంకా తగ్గలేదని సర్దిచెప్పుకున్నారు.ఎన్నికలకు ముందు వైఎస్ రాజశేఖర్ రెడ్డి తనయ షర్మిలను పీసీసీ చీఫ్ గా నియమించి మరో ప్రయోగం చేశారు. అయితే ఎన్నికలకు ముందు కొంత ఊపు కనిపించినట్లు కనిపించింది కానీ ఫలితాలు మాత్రం కనపడలేదు. కనీసం కడప లాంటి చోట షర్మిల కూడా గెలవలేకపోయారు. ఇక ఎన్నికలకు ముందు వైసీపీ టిక్కెట్ దక్కని వారు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఎన్నికలు ముగిసినతర్వాత ఫలితాలను చూస్తే మూడు శాతం ఓట్లు మాత్రమే కాంగ్రెస్ కు రావడంతో ఇక వైసీపీ నుంచి కాంగ్రెస్ లోకి వచ్చే వాళ్లు కూడా ఎవరూ ఉండకపోవచ్చు. వైఎస్ షర్మిలది ఏపీలో కాంగ్రెస్ ఆఖరి ప్రయోగంగానే చెప్పుకోవాలి. అంతకు మించి మరొకరిని నియమించినా ప్రయోజనం ఉండదు. ఇక కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే తప్ప ఏపీలో కాంగ్రెస్ కు మంచి రోజులు రావన్నది నిజం.

# ఇంజక్షన్లు వికటించి రోగులకు అస్వస్థత

**అనకాపల్లి, జూలై 11 (పీపుల్స్ మోటివేషన్) :**

అనకాపల్లి జిల్లా నక్కపల్లి ప్రభుత్వా స్పత్రిలో ఇంజక్షన్లు వికటించి రోగు లు అస్వస్థతకు గురయ్యారు. రాత్రి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు ఇంజక్షన్లు వేశారు. అయి తే ఏమైందో తెలియదు ఉన్నట్లుండి ఇంజక్షన్లు తీసుకున్న వారికి ఊపిరి అందక తీవ్ర ఇబ్బంది పడ్డారు. పరిస్థితిని గమనించిన వైద్యులు వైద్యం అందించినా ఫలితం లేకపో వడంతో పోలీసులకు సమాచారమి చ్చారు. విషయం తెలుసుకున్న హోంమంత్రి అనిత కలెక్టర్తో మాట్లా డి హుటాహుటిన అంబులెన్సులు పంపించారు. మెరుగైన చికిత్స కోసం బాధితులందర్నీ అనకాపల్లి ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. 18 మంది రోగులు అస్వస్థతకు గురికాగా వీరిలో ఐదుగురు చిన్నారులున్నారు. ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది.

# టీడీపీ కార్యాలయంపై దాడి కేసు

## నిందితులను రిమాండ్ కు తరలింపు

**గన్నవరం, జూలై 11 (పీపుల్స్ మోటివేషన్) :**


గన్నవరం తెదేపా కార్యాలయంపై దాడి కేసులో నిందితులను పోలీసులు కోర్ట్ లో హాజరు పర్చారు. వైద్యపరీక్షల అనంతరం 15మంది నిందితులను కోర్ట్ కు తీసుకొచ్చారు. దాడి కేసులో సీసీ ఫుటేజ్, వీడియోల ఆధారంగా గుర్తించిన 93 మందిలో 15 మందిని అదుపులోకి తీసుకున్నారు. గన్నవరం జూనియర్ సివిల్ జడ్జి కోర్ట్ లో15 మంది నిందితులను ప్రవేశపెట్టారు. అర్థరాత్రి ఒంటిగంట వరకు రిమాండ్ ను సివిల్ జడ్జి కోర్టు పరిశీలించారు. ఈనెల 24వ తారీఖు వరకు 14 రోజులు రిమాండ్ విధించారు. దాంతో నిందితులను నూజివీడు జైలుకు తరలించారు.

తెలుగు దినపత్రిక
పీపుల్స్ మోటివేషన్
People's Motivation

# గేమ్ ఛేంజర్‌తో నా కల నెరవేరింది

## దర్శకుడు శంకర్ ఆసక్తికర ప్రకటన

రామ్ చరణ్ హీరోగా తెరకెక్కిస్తున్న చిత్రం 'గేమ్ ఛేంజర్ సినిమా గురించి దర్శకుడు శంకర్ ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. తన మరో చిత్రం 'భారతీయుడు 2' ప్రచారంలో భాగంగా పాల్గొన్న ఓ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడారు. 'నేను తెరకెక్కించిన తమిళ చిత్రాలకు తెలుగులోనూ మంచి ఆదరణ దక్కింది. అందుకే నేరుగా తెలుగులోనే ఓ సినిమా తీయాలని ఎప్పుడూ అనుకుంటూ ఉండేవాణ్ని. ఆ మేరకు చేసిన కొన్ని ప్రయత్నాలు విఫలమయ్యాయి. ఎట్టకేలకు 'గేమ్ ఛేంజర్'తో నా కల నెరవేరుతోంది. కార్తీక్ సుబ్బరాజు కథతో దీన్ని రూపొందిస్తున్నా. ఇది పూర్తిస్థాయి యాక్షన్ చిత్రం. నా నుంచి ఇలాంటి మాస్ సినిమా వచ్చి చాలా కాలమైంది' అని పేర్కొన్నారు. సంబంధిత విజువల్స్‌ను రామ్‌చరణ్ ఫ్యాన్స్ నెట్టింట పోస్ట్ చేస్తూ ఆనందం వ్యక్తంచేస్తున్నారు. 'గేమ్ ఛేంజర్' మాస్ ఫిల్మ్ అంటూ ఎమోజీలు జత చేస్తున్నారు. ఈ సినిమాలో చరణ్ ద్విపాత్రాభినయం చేశారని సమాచారం. కియారా అద్వాణి హీరోయిన్. అంజలి, శ్రీకాంత్, ఎస్‌జే సూర్య, నవీన్‌చంద్ర కీలక పాత్రలు పోషించారు. హీరో పాత్రకు సంబంధించిన చిత్రీకరణ ఇటీవల పూర్తయింది. దాదాపు 10 రోజుల షూటింగ్ మిగిలిఉందని శంకర్ ఇటీవల ప్రెస్‌మీట్‌లో చెప్పారు. ఫైనల్ ఎడిటింగ్ అయ్యాక రిలీజ్ డేట్ ప్రకటిస్తామని తెలిపారు. కమల్ హాసన్ కథానాయకుడిగా ఆయన తెరకెక్కించిన 'భారతీయుడు 2' శుక్రవారం బాక్సాఫీసు ముందుకు రానుంది. 1996లో వచ్చిన 'భారతీయుడు'కి సీక్వెల్ ఇది. సిద్దార్థ్, రకుల్‌ప్రీత్ సింగ్ కీలక పాత్రధారులు.






## వచ్చే నెలలో వస్తోన్న విజయ్ తుఫాన్

విజయ్ ఆంటోనీ నటిస్తున్న తాజా చిత్రం 'తుఫాన్'. ఇన్ఫినిటీ ఫిల్మ్ వెంచర్స్ బ్యానర్ పై కమల్ బోరా, డి.లలితా, బి. ప్రదీప్, పంకజ్ బోరా నిర్మిస్తున్నారు. పొయెటిక్ యాక్షన్ ఎంటర్ టైనర్ జానర్ లో ఈ సినిమాను రూపొందిస్తున్నారు దర్శకుడు విజయ్ మిల్టన్. ఆగస్టు 2న వరల్డ్ వైడ్ గా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు తీసుకొస్తున్నట్లు మేకర్స్ ఈ రోజు ప్రకటించారు. 'తనను చిన్న చూపు చూసే సమాజం భవితను మార్చిన ఓ వ్యక్తి కథ ఇది. ఓ దీవి నేపథ్యంగా సాగే ఈ సినిమా షూటింగ్ ను అండమాన్, డయ్యూ డామన్ లలో చిత్రీకరించాం. ఇప్పటికే రిలీజ్ చేసిన పాటలకు, ట్రైలర్ కు హ్యూజ్ రెస్పాన్స్ వచ్చింది. సినిమాకు కూడా ఇదే పాజిటివ్ రెస్పాన్స్ వస్తుందని నమ్ముతున్నాం' అని మేకర్స్ అన్నారు. విజయ్ ఆంటోనీ, శరత్ కుమార్, సత్యరాజ్, డాలీ ధనుంజయ, మేఘా ఆకాష్, మురళీ శర్మ, పృథ్వీ అంబర్, శరణ్య పొన్వన్నన్, తలైవాసల్ విజయ్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి అచ్చు రాజమణి, విజయ్ ఆంటోనీ.






## మిస్టర్ బచ్చన్ సాంగ్‌పై కామెంట్స్ గట్టిగా సమాధానం ఇచ్చిన హరీష్ శంకర్

రవితేజ హీరోగా హరీశ్ శంకర్ 'మిస్టర్ బచ్చన్' సినిమాను తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. క్యాడ్‌బరీ యాడ్‌తో మంచి గుర్తింపు తెచ్చుకున్న భాగ్యశ్రీ బోర్సే ఈ చిత్రంతో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇస్తున్నారు. ఈ హీరోహీరోయిన్లపై చిత్రీకరించిన 'సితార్ సాంగ్'ను ప్రచారంలో భాగంగా చిత్రబృందం బుధవారం విడుదల చేసింది. సాహిత్యం బాగుందంటూ పలువురు శ్రోతలు నెట్టింట పెట్టిన పోస్ట్‌లపై శంకర్ స్పందిస్తూ వారికి థ్యాంక్స్ చెప్పారు. మరోవైపు, రవితేజ, భాగ్యశ్రీల మధ్య వయసు వ్యత్యాసాన్ని హైలైట్ చేస్తూ.. ఫిల్మ్‌మేకర్స్ హీరోయిన్ల ఎక్స్‌పోజింగ్‌కే ప్రాధాన్యం ఇస్తున్నారు. అందుకే ఈ పాటలో ఆమె ఫేస్‌ని చూపించే ప్రయత్నం చేయలేదు అని ఒకరు కామెంట్ చేశారు. దానిపై హరీశ్ స్పందించారు. మీరు కనుగొన్న దానికి కంగ్రాట్స్. మీరు నోబెల్ ప్రైజ్‌కు అప్లై చేస్తే బాగుంటుంది. ఇలానే మీ పని కొనసాగించండి. మేం స్వాగతిస్తాం అని వ్యంగ్యంగా పేర్కొన్నారు. మిక్కీ జె.మేయర్ స్వరాలు సమకూర్చిన ఈ పాట యూట్యూబ్‌లో మంచి వ్యూస్ సొంతం చేసుకుంది. రవితేజ`హరీశ్ కాంబోలో ఇంతకుముందు 'షాక్', 'మిరపకాయ్' చిత్రాలొచ్చిన సంగతి తెలిసిందే.

## రిలీజ్‌కు ముందు పుష్ప`2 సంచలనాలు

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ టైటిల్ రోల్‌లో నటిస్తున్న ఫ్రాంఛైజీ ప్రాజెక్ట్ పుష్ప ది రూల్ సుకుమార్ దర్శకత్వం వహిస్తున్నాడు. కన్నడ భామ రష్మిక మందన్నా ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. ముందుగా ప్రకటించిన ప్రకారం ఆగస్టులో రావాల్సిన ఈ చిత్రాన్ని వాయిదా వేస్తూ.. డిసెంబర్ 6న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేస్తున్నట్టు తెలియజేశారు. కాగా ఇప్పుడు పుష్ప 2 హిందీ వెర్షన్ నాన్ థియాట్రికల్ రైట్స్‌కు సంబంధించిన వార్త ఒకటి హాట్ టాపిక్‌గా మారింది. తమిళ నిర్మాత కేఈ జ్ఞానవేల్ రాజా ఈ మూవీ నాన్ థియాట్రికల్ రైట్స్ రూ.260 కోట్ల భారీ మొత్తం పలికాయి. సింగిల్‌గా లేదా మల్టీ లాంగ్వేజ్ పరంగా చూసుకున్నా నాన్ థియాట్రికల్ రైట్స్ విషయంలో ఈ ఫిగర్ ఇండియన్ సినీ చరిత్రలోనే అతి పెద్దదని చెప్పారు. ఇప్పుడీ కామెంట్స్ టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా నిలుస్తున్నాయి. ఈ మూవీకి రాక్‌స్టార్ దేవీ శ్రీ ప్రసాద్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. ఇప్పటికే మ్యూజిక్ ప్రమోషన్స్ షురూ చేసిన బన్నీ టీం.. పుష్ప పుష్ప సాంగ్ లాంచ్ చేయగా నెట్టింట మిలియన్ల సంఖ్యలో వ్యూస్ రాబడుతోంది. మరోవైపు రెండో సాంగ్ సూసేకి కూడా తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ, హిందీ, బెంగాలీ భాషల్లో నెట్టింట మిలియన్ల సంఖ్యలో వ్యూస్‌తోపాటు వేల సంఖ్యలో రీల్స్ నెట్టింట సందడి చేస్తున్నాఇ. పుష్ప ది రూల్‌లో ఫహద్ ఫాసిల్, జగదీష్ ప్రతాప్ బండారి, జగపతిబాబు, ప్రకాశ్ రాజ్, సునీల్, అనసూయ భరద్వాజ్, రావు రమేశ్, ధనంజయ, షణ్ముఖ్, అజయ్, శ్రీతేజ్ ఇతర కీలక పాత్రల్లో నటి

# మిస్టర్ బచ్చన్‌లో మరో రొమాంటిక్ సాంగ్

'మిస్టర్ బచ్చన్'గా సినీప్రియుల్ని అలరించనున్నారు రవితేజ. ఆయన కథానాయకుడిగా నటించిన ఈ చిత్రాన్ని హరీశ్ శంకర్ తెరకెక్కించారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సంస్థ నిర్మించింది. భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. జగపతిబాబు, సచిన్ ఖేడేకర్ కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే ప్రచార పర్వాన్ని వేగవంతం చేస్తోంది చిత్ర బృందం. ఇందులో భాగంగా బుధవారం ఈ చిత్ర తొలి గీతాన్ని విడుదల చేశారు. 'చిట్టి గువ్వ పిట్టలాంటి చక్కనమ్మా.. బొట్టు పెట్టి పట్టుచీర కట్టుకోమ్మా' అంటూ సాగిన ఈ మెలోడీ గీతానికి మిక్కీ జె మేయర్ స్వరాలు సమకూర్చగా.. సాహితీ సాహిత్యమందించారు. సాకేత్ కొమండూరి, సమీర భరద్వాజ్ సంయుక్తంగా ఆలపించారు. ఈ పాటలో రవితేజ, భాగ్యశ్రీ జంటగా కనిపించిన తీరు.. శేఖర్ మాస్టర్ తీర్చిదిద్దిన స్టెప్పులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. స్టైలిష్ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ముస్తాబవుతోన్న ఈ సినిమా ప్రస్తుతం నిర్మాణానంతర పనుల్లో ఉంది. త్వరలో విడుదల తేదీ ప్రకటించనున్నారు. ఈ సినిమాకి కూర్పు: ఉజ్వల్ కులకర్ణి, ఛాయాగ్రహణం: అయనంక బోస్.

Printed, Published and Owned by M.RAMESH, H.No. 87/-569, Ground floor, Madhavanagar, Kurnool City, Kurnool - 518002, Andhrapradesh State, and Printing at PSR Printers, No.87-569, Beside, Chenchureddy Apartment, Madhava nagar,Kurnool - 518002 District, Andhrapradesh, Published from H.No. H.No. 87/-569, Ground floor, Madhavanagar, Kurnool City, Kurnool - 518002, Andhrapradesh, Editor : M.RAMESH, Mob : 8008622746,E-mail : peoplesmotivation22@gmail.com